

హైదరాబాద్ సచివాలయంలో జరిగిన సమీక్షలో పాల్గొన్న డిప్యూటీసీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఉత్తమ్

పత్తి వ్యాపారుల సిండికేట్ దందా

- ఏజెన్సీలో రైతులను నిలువునా దోచుకుంటున్న దళారులు
- క్వింటా రూ.4,500నుంచి రూ.5,800కే కొనుగోలు
- సీసీఐ కేంద్రాలు లేక తీవ్రంగా నష్టపోతున్న రైతులు

పాల్వంచ రూరల్, జనవరి 19: ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కక, పంటను విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా భద్రాద్రి ఏజెన్సీ ప్రాంతంలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. అకాల వర్షాలు, తుఫాను ధాటికి దెబ్బతిన్నా చివరికి ఎంతో కొంత పంట చేతికి వచ్చినా దాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు లేక తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుల అవసరాన్ని ఆసరాగా తీసుకొని దళారులు తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తూ వారి శ్రమను భారీగా దోచుకుంటున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు దూరంగా ఉండడంతో వాటివద్దకు రైతులు వెళ్లలేక తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద కూడా దళారులకే మొదటి ప్రాధన్యత ఇస్తూ, రైతులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దళారుల సిండికేట్‌తో రైతుదగా

జిల్లాలో వరి పంట తరువాత పత్తిని రైతులు ఎక్కువగా పండిస్తారు. జిల్లాలో సుమారు 1,55,000 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఒక్క పాల్వంచ మండలంలోనే 15వేల ఎకరాల పత్తి పంట సాగులో ఉంది. దళారులు సిండికేట్‌గా మారి తక్కువ ధర చెల్లించి రైతులను మోసం చేస్తున్నారు. పత్తికి ప్రభుత్వ మద్దతు ధర ప్రస్తుతం క్వింటా రూ.7,020 ఉండగా ప్రైవేటు వ్యాపారులు ఏజెన్సీ ఏరియాల్లో క్వింటా రూ.4,500 నుంచి రూ.5,800 చెల్లిస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. దళారులు ముందుగా సిండికేటుగా మారి ఒక ధర నిర్ణయిస్తున్నారు. రైతులు పత్తి పంటను ఎక్కడ వెళ్లి అమ్మాలనుకున్నా ప్రైవేటు వ్యాపారులంతా తక్కువ ధర చెబుతున్నారు. దీంతో రైతులు ఏంచేయాలో తెలియక పెట్టుబడులు అప్పుల భారంతో తక్కువ రేటుకే దళారులను తమ పంటను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కానరాని సీసీఐ కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో పత్తి పంట ఎక్కువగా సాగవుతుంది. కానీ సీసీఐ కొనుగోలు కేంద్రాలు మాత్రం చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంత రైతులకు ప్రభుత్వ సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఉన్నాయనే విషయం కూడా తెలియదు. ఎందుకంటే ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తోందని అధికారులు ఎక్కడా ప్రచారం కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో ఏజెన్సీలో అధికారుల తీరు దళారులను ప్రోత్సహిస్తున్నట్లు ఉందని పలువురు విమర్శిస్తున్నారు. జిల్లాలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు సుజాతనగర్ మండలంలోని డేగలమడుగు, బూర్గంపహాడ్, అశ్వాపురం మండలంలో నెల్లిపాక, ఇల్లెందు ప్రాంతంలో కారేపల్లి మాత్రమే ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాలో పత్తి ఎక్కువగా పండుతున్నందున సీసీఐ కొనుగోలు కేంద్రాలు పెంచాలని రైతులు కోరుతున్నారు.



దంతెలబోర ఏజెన్సీ ఏరియాలో పత్తి పంటను కొనుగోలు చేస్తున్న దళారులు..

‘సీతారామ’ అత్యవసర పనులకు నిధులు!

- రాబోయే బడ్జెట్‌లో కేటాయింపునకు ప్రతిపాదన
- వచ్చే సీజన్‌లోనే వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలని నిర్ణయం
- హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన సమీక్ష
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన అత్యవసర పనులకు వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అలాగే రాబోయే వానాకాలం సీజన్‌కు వైరా రిజర్వాయర్‌కు సీతారామను అనుసంధానం చేసి గోదావరి నీటిని పారించేలా పనులు నిర్వహించాలని మంత్రులు నిర్ణయించారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో సీతారామ ప్రాజెక్టుపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు హాజరైన ఈ సమావేశంలో ఉమ్మడిజిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులపై చర్చించారు. వచ్చే బడ్జెట్ కేటాయింపుల్లో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయించాల్సిన నిధులు, నిర్వహించాల్సిన పనులతో పాటు సీతారామ ప్రాజెక్టు పనుల నిర్వహణపై చర్చించారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు పెద్దఎత్తున అవసరం ఉన్నందున తొలుత తక్షణ అవసరమైన పనులకు నిధులు కేటాయింపులు జరపాలని నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యంగా వైరా ప్రాజెక్టుకు అనుసంధానం చేయడం వల్ల సాగర్ ఆయకట్టులో కొంతభాగానికి గోదావరి జలాలు అందే అవకాశం ఉంటుందని సమావేశంలో మంత్రి తుమ్మల సూచించారు. ప్రస్తుతం సాగుతున్న పనుల్లో గ్యాప్ పనులకు నిధులు కేటాయించి ఆపనులు పూర్తయ్యేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బడ్జెట్ రూపకల్పన అనంతరం సీతారామ ప్రాజెక్టు పనులు సందర్శించాలని క్షేత్రస్థాయిలో సమీక్షలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజనీరింగ్ చీఫ్ తదితరులు హాజరయ్యారు.

ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- మెరుగైన ఫలితాల సాధనకు అధికారుల చర్యలు
- ప్రధాన పరీక్షల తర్వాత ఎంసెట్‌లోనూ శిక్షణ

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 19: ఇంటర్‌లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఇంటర్ విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ఇటీవలే వార్షిక, ప్రయోగ పరీక్షల తేదీలను ప్రకటించిన బోర్డు అధికారులు ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రభుత్వ కళాశాలల్లో నూరుశాతం పాఠ్యప్రణాళిక పూర్తి చేయాలని నిర్ణయించారు. పునశ్చరణ తరగతులు నిర్వహిస్తూ మెరుగైన ఫలితాల సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు వచ్చే నెలలో ప్రయోగ, వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో పిల్లల్లో పరీక్షలపై ఆందోళన లేకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించారు. గతేడాది డిసెంబరు నెలాఖరు వరకు పాఠ్యప్రణాళిక 90శాతం పూర్తి చేశారు. మిగిలిన ప్రణాళికను ఈ నెలాఖరులోగా పూర్తి చేయనున్నారు. తరగతుల బోధనతో పాటు జనవరి ఆరంభం నుంచి పునశ్చరణ తరగతులు ప్రారంభించారు. అందుకు అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.



(ఫైల్)

ప్రతిభ ఆధారంగా వంద మంది ఎంపిక

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ శిక్షణ ఇవ్వనున్నారు. దీనికి సంబంధించి ప్రత్యేక పుస్తకాలను ముద్రించి ఇవ్వాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థుల సౌకర్యార్థం యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పునశ్చరణ తరగతులతో పాటు అధ్యాపకులు ఎంసెట్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. రెండు మాసాల పాటు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ ఆధారంగా వంద మందిని ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్, మే నెలల్లో శిక్షణ తరగతులకు హాజరయ్యేవారికి జిల్లాకేంద్రంలో ప్రత్యేక ఆశ్రయం, భోజన వసతి కల్పించనున్నారు.

‘ఎస్‌ఎంసీ’లకు నోటిఫికేషన్ నేడు

29న పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 19: ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీల (ఎస్ఎంఎస్) ఎన్నికలకు నగరా మోగింది. దానికి సంబంధించిన షెడ్యూల్‌ను ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ శుక్రవారం ప్రకటించారు. శనివారం ఈ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుండగా.. 29న ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఈ యాజమాన్య కమిటీలకు చివరిగా 2019లో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత కొవిడ్, తదితర పరిణామాల నేపథ్యంలో ఎన్నికలు జరగకపోవడంతో పాత కమిటీలే కొనసాగుతున్నాయి. శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కాగానే విద్యార్థుల తల్లిదండ్రుల జాబితా ప్రకటిస్తారు. 22న అభ్యంతరాలు స్వీకరణ, 29న ఎన్నికలు, అదే రోజు ఫలితాల ప్రకటన, ఆ వెంటనే ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ ఎన్నికకు సన్నాహాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు , ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవిలు మొత్తం 1324 ఉండగా.. మొత్తం 82,732మంది విద్యార్థులున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,049, ప్రాథమికోన్నత పాఠశాలలు 175, ఉన్నత పాఠశాలలు 131, వాటిలో చదివే విద్యార్థులు 76,415మంది ఉన్నారు. వీరి తల్లిదండ్రుల్లో ఒకరికి ఓటు హక్కు ఉంటుంది. జడ్పీ, ప్రభుత్వ, ఆశ్రమ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, యూఆర్ఎస్, ఆదర్శ పాఠశాలల్లో నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి.

ప్రాథమిక పాఠశాలల్లో 10, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14, ఉన్నత పాఠశాలల్లో 10 మంది సభ్యులతో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకుంటారు. ఓటర్ల జాబితాలోని తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుల్లో ఒకరే ఓటుకు అర్హులు కాగా.. 50శాతం మంది ఓటింగ్‌కు హాజరవకపోతే కోరం లేనట్లే. సభ్యులు చేతులెత్తే పద్ధతి లేదా మూజువాణి ఓటుతో కమిటీని ఎన్నుకుంటారు. ఒక వేళ తప్పనిసరి పరిస్థితి వస్తే రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటేస్తారు.

డీసీసీబీ అప్పులు వసూలు చేస్తాం

- బకాయిదారులకు నోటీసులిచ్చి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం
- బ్యాంకు మూలధనం, డిపాజిట్లలో పురోగతి
- పాలకవర్గ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య



ఖమ్మం వ్యవసాయం, జనవరి 19 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో ఉన్న బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య తెలిపారు. శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో బకాయిల రికవరీపై చర్చించిన ఆయన సాధ్యమైనంత వేగంగా రుణాలు తిరిగి వసూలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నాగభూషయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశంలో సూచించిన మేరకు ఆర్థిక ఏడాది ముగిసే సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో బకాయిదారులకు నోటీసులు ఇవ్వడంతోపాటు చట్టపరంగాచర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టామన్నారు. డీసీసీబీ ప్రగతి పథంలో పయనిస్తోందని, మూలధనం 144.33కోట్లు కాగా, వాటిలో 1109.35కోట్ల డిపాజిట్లున్నాయన్నారు. ఖాతాదారులకు 100 సంఘాలు, 50 బ్యాంకుశాఖల ద్వారా 2023డిసెంబరు 18నాటికి రూ.1838.83 కోట్ల వివిధ రుణాలు ఇచ్చామన్నారు. ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఉన్న 100పీఏసీఎస్‌లు, 50 బ్యాంకు బ్రాంచ్‌ల ద్వారా వివిధ వర్గాలకు సేవలందుతున్నాయన్నారు. బ్యాంకు టర్నోవర్ 2020లో 2375.03కోట్లు ఉండగా, 2023 డిసెంబరు 18నాటికి 2948.18కోట్లకు చేరిందని, 573.15కోట్ల ముందంజలో ఉన్నామని వివరించారు. అప్పట్లో 7.23కోట్ల నష్టం ఉండగా, నేడు 10.88కోట్ల లాభాల్లో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో సీఈవో రెహమాన్ పాల్గొన్నారు.

పట్టాభిషేకంలో రాజ లాంఛనాలతో..

స్వామి వారికి కిరీటధారణ తప్పనిసరి

వైదిక సిబ్బందికి ఉత్తర్వులిచ్చిన భద్రాద్రి దేవస్థానం ఈవో

భద్రాచలం జనవరి 19: భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీనెల పుష్యమి నక్షత్రం సందర్భంగా నిర్వహించే శ్రీరామ పట్టాభిషేకం సమయంలో రాజ లాంఛనాలతో స్వామివారికి కిరీట ధారణ తప్పనిసరిగా చేయాలని దేవస్థానం వైదిక సిబ్బందికి ఈవో ఎల్ రమాదేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కొన్ని కొన్ని సమయాల్లో స్వామివారికి కిరీట ధారణ చేయటం లేదని భక్తులు, పాత్రికేయుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.ఈక్రమంలో భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశంతోపాటు దేవస్థానం కీర్తి ప్రతిష్ఠలకు భంగం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇకపై ప్రతినెల పుష్యమి నక్షత్రం రోజున పట్టాభిషేకం సమయంలో తప్పనిసరిగా వైదిక సిబ్బంది రాజలాంఛనాలతో కిరీటధారణ చేయనున్నారు. ఎవరైనా ఈ ఆదేశాలను విస్మరిస్తే ఇద్దరు ప్రధాన అర్చకులతో పాటు సంబంధిత సిబ్బంది బాధ్యులవుతారని ఈవో ఉత్వర్వుల్లో స్పష్టం చేశారు. కిరీటధారణ చేసేలా స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ఆలయ పర్యవేక్షకులు పర్యవేక్షించాలని సూచించారు.

అనుమతుల మాటున అక్రమాలు!

- ప్రైవేటు భూమికి పర్మిషన్లు.. ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలు
- కబ్జా చేసిన ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు నిర్మించి అమ్మకాలు
- ఖమ్మంలోని సర్వేనెంబరు 344లోని ప్రభుత్వ భూమి ఆక్రమణ
- దర్జాగా అనుమతులిచ్చి.. పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- పత్రాలు పరిశీలిస్తే వెలుగులోకి
- దందాలో కొందరు గత అధికార పార్టీ నేతలు

ఖమ్మం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇది ప్రభుత్వ భూమి కదా.. ఇక్కడ ఇంత పెద్ద ఎత్తున నిర్మాణాలు ఎలా చేస్తున్నారు? అని స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే చాలు.. ఇది ప్రభుత్వ భూమి ఏంటి? పక్కా ప్రైవేటు స్థలం. కావాలంటే కార్పొరేషన్ కార్యాలయ అధికారులు ఇచ్చిన అనుమతుల పత్రాలు చూసుకోండి’ అంటూ ప్రస్తుతం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ స్థలాల ఆక్రమణదారులు చెబుతున్న మాటలు. అది కూడా మామూలుగా కాదండోయ్ దబాయించి మరీ ఇది మా స్థలమంటూ బుకాయిస్తారంటూ పలు ప్రాంతాల్లోని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్కడో తమ పేరుతోనో, తమకు సంబంధించిన వారి పేరుమీదనో ఉన్న పక్క సర్వే నెంబర్లలోని స్థలాలకు అనుమతులు పొంది అక్రమాలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. కాగా ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చిన 344సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూమి కూడా ఇదే తరహాలో ఆక్రమణలకు పాల్పడినట్టు తెలిసింది. అందులో గత అధికార పార్టీ నేతలు కొందరు ఉండగా.. వారు కార్పొరేషన్ కార్యాలయంలో తమ పలుకుబడి ఉపయోగించి తతంగం నడిపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ తరహా కొత్త దందా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



344 సర్వే నెంబరు మ్యాప్ వ్యూ

పర్మిషన్లు ఒక చోట.. నిర్మాణాలు మరోచోట

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో టీఎస్ బీపాస్ తీసుకొచ్చి ఇంటి నిర్మాణాలకు సంబంధించిన అనుమతుల ప్రక్రియకు చాలా తక్కువ సమయం పట్టేలా ప్రణాళిక రూపొందించారు. సదరు ప్రక్రియలో భాగంగా ఎవరైనా ఇల్లు, లేదా అపార్ట్‌మెంట్లకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న తర్వాత వారు చేసుకున్న దరఖాస్తుకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించి అది ప్రభుత్వ భూమినా, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందా? ఎన్నెస్పీకి చెందినా భూమి, రోడ్లు లాంటి అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత మాత్రమే దానికి అనుమతులు మంజూరు చేస్తారు. అయితే గతంలో నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ వారు ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఆయా అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరుగుతోందన్న ఉద్దేశంతో సుమారు మూడు నెలల క్రితం ఆ పద్ధతిని మార్చి కేవలం టౌన్‌ప్లానింగ్ వారికే బాధ్యతలను అప్పగించారు. ఇదిలా ఉండగా ఖమ్మం నగరంలో మాత్రం దానికి పూర్తి విరుద్ధంగా అనుమతులు ఇచ్చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినవారికి అందలం వేస్తూ, పరపతి ఉపయోగించిన వారి నుంచి ప్రతిఫలం పొందుతూ భూముల స్వభావాన్ని పరిశీలించకుండానే అనుమతులు మంజూరు చేశారన్న విమర్శలూ లేకపోలేదు. దాన్ని అవకాశంగా తీసుకున్న కొందరు అక్రమార్కులు ఎక్కడ ప్రభుత్వ భూమిని కనిపించినా వదలకుండా దర్జాగా కబ్జా చేసినట్టు తెలుస్తోంది. ఆయా ప్రభుత్వ భూములకు అనుకుని ఉన్న సర్వే నెంబర్లలోని ప్రైవేటు స్థలాల చూపి కార్పొరేషన్ కార్యాలయంలో అనుమతులు పొందిన అనంతరం ఆ అనుమతులను చూపి పక్కన ఉన్న ప్రభుత్వ భూముల్లో కట్టడాలు చేసి ఆక్రమణలకు పాల్పడినట్టు సమాచారం. అయితే ప్రభుత్వ భూమిలో అపార్ట్‌మెంట్లు కట్టడాలు అయితే విక్రయాలకు సులువుగా ఉంటుందని భావించి ఆ భూముల్లో పెద్ద ఎత్తున అపార్ట్‌మెంట్లు కట్టి విక్రయాలు చేపట్టేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది.



సర్వేనెంబరు 344లో ఆక్రమణలు..

ఖమ్మం నగరంలోని సర్వే నెంబరు 344లో పొజిషన్ ఉన్న వ్యక్తిపై ఉన్న భూమిని మినహాయించినా రెండెకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉండాల్సి ఉంది. అక్కడ ప్రభుత్వ భూమి ఉన్నట్టు ల్యాండ్ సర్వేయర్ నుంచి 2013లో ఖమ్మం అర్బన్ ఎమ్మార్వోకు పంపిన లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ సర్వే నెంబరుకు సంబంధించిన ప్రొసీడింగ్ ఫైలు మాయమైనట్టు తెలుస్తుండగా.. సదరు సర్వే నెంబరులోనూ ఇదే తరహాలో ఆక్రమణలు జరిగినట్టు విశ్వసనీయ సమాచారం. ‘స్వాధీనం చేసుకున్నా.. స్వాహా చేశారు’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో గురువారం ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో అక్కడకు వెళ్లిన అధికారులు తూతూమంత్రంగా విచారణ నిర్వహించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే 344సర్వే నెంబరులో ప్రస్తుతం జరుగుతున్న కట్టడాలకు సంబంధించిన అనుమతులు మరొక సర్వే నెంబరులో ఉన్నట్టు తెలిసింది. పక్కన ఉన్న సర్వే నెంబరు పేరిట సుమారు వెయ్యి గజాల్లో నిర్మాణానికి అనుమతులు తీసుకున్న కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమి ఉన్న 344సర్వే నెంబరులో నిర్మాణాలు చేపట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాదు 344సర్వే నెంబరులో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి అనుమతులు ఇచ్చిన అధికారులు సదరు నిర్మాణానికి సంబంధించి మార్టిగేజ్‌కూడా చేయించుకోవడం గమనార్హం. ప్రభుత్వ భూమిని స్వాహా చేసేందుకు వారి భూమిని వారికే మార్టిగేజ్ చేయడం కొసమెరుపు. కాగా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తొలుత 344 సర్వే నెంబరుకు హద్దులు ఏర్పాటు చేసి దాని లోపల చేపడుతున్న నిర్మాణాల పత్రాల కాపీలను పరిశీలిస్తే ఆక్రమణలు చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారి వివరాలు బహిర్గతమయ్యే అవకాశం లేకపోలేదు. అలా చేసినా సదరు భూమిలో ప్రభుత్వ భూమి తేలుతుందని, ఈ దిశగా అయినా అధికారులు పూర్తి విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

సాహితీ కార్యశాల..



విద్యార్థుల సాహితీ ప్రతిభను పరిశీలిస్తున్న వాసిరెడ్డి రమేష్ బాబు

చిన్నారులకు విద్యార్థిదశలోనే మాతృభాష, సాహిత్యంపై అవగాహన, అభిలాషను పెంపొందించడమే లక్ష్యంగా బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌లో కథ,కవిత కార్యశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రెండురోజులపాటు జరిగే ఈ కార్యక్రమాన్ని శుక్రవారం కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు విద్యార్థులతో జ్యోతి ప్రజ్వలన చేయించి ప్రారంభించారు. తొలిరోజు కార్యశాలకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన 33 ప్రభుత్వ, 18 ప్రైవేటు పాఠశాలకు చెందిన 325 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి డీఈవో ఎం.వెంకటేశ్వరచారితో పాటు పలు జిల్లాలకు చెందిన కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ కార్యశాలలో విద్యార్థుల వ్యాసాలు, కథలు, కవితలను వాసిరెడ్డి రమేష్‌బాబు పర్యవేక్షించారు.

నిద్రమత్తు వీడుతారా?

- వంతెన నిర్మాణంలో అడుగడుగునా డొల్లతనమే
- నాణ్యమైన సెంట్రింగ్ ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం
- పని చేస్తున్నవారిపై నిర్బంధకాండ.. కనీసవేతనాలూ కరవే
- గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించని తీరు
- కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్లదే రాజ్యమని ఆరోపణలు
- కూలిన స్లాబ్ శిథిలాలను రాత్రికిరాత్రే తొలగించిన వైనం

వైరా, జనవరి 19: మనలో చాలా మందికి నేషనల్ హైవే అథారిటీ నిర్మించే రోడ్లు, వంతెనలు, ఇతరత్రా భవన నిర్మాణాలంటే చాలా నమ్మకం. ఎందుకంటే వారు చేపట్టే నిర్మాణాల్లో నాణ్యత విషయంలో రాజీపడరని, రేయింబవళ్లు క్షేత్రస్థాయిలోనే ఉండి పనులను పర్యవేక్షిస్తారని.. కానీ ఆ నమ్మకం వమ్ము అవుతోంది. ఆ భరోసా సన్నగి ల్లుతోంది. గురువారం వైరా పరిధిలో జరిగిన సంఘటన పైవాటికి బలం చేకూర్చు తోంది. ఇదే సమయంలో నేషనల్ హైవే అథార్టీకి చెందిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో జరిగిన డొల్లతనాన్ని సంబంధిత అధికారులు గుణపాఠంగా తీసుకుంటారా అనే డిమాండ్ ప్రజల నుంచి వక్తమవుతోంది. నిద్రమత్తు వీడి నిర్మాణాలపై పర్యవేక్షణ పెంచాలనే డిమాండ్ సర్వత్రా విన్పిస్తోంది.

వేల కోట్ల రూపాయలతో..


నేషనల్ హైవే అథార్టీ ఆధ్వర్యంలో వేలకోట్లరూపాయలతో ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నాలుగులైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం సంబంధిత కాంట్రాక్టర్, సబ్‌కాంట్రాక్టర్ల ఇష్టానుసారం జరుగుతుందనే విమర్శలు న్నాయి. నేషనల్ హైవే అథార్టీకి చెందిన నిర్మాణాలు కావడంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో కీలకంగా వ్యవహరించిన రెవెన్యూశాఖ అధికారులకు సైతం కనీసం ఎలాంటి పర్యవేక్షణ, తనిఖీల బాధ్యతలు లేకపోవడంతో ఈ పనుల్లో ఏంజరుగుతుందో కూడా వారికి అంతుపట్టడంలేదు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టు క్యాంపు కార్యాలయాల్లోకి కూడా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అనుమతి లేకుండా వెళ్లలేని పరిస్థితి ఉంది. కొంతమంది అధికారులు ఈ రోడ్డు నిర్మాణ తీరుపై ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలంలోని సోమవరం వరకు ప్యాకేజీ1 కింద 33.604 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని రూ.772.11 కోట్లతో చేపట్టారు. 33వ కిలోమీటర్ వద్ద రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు పలు రాష్ట్రాలకు అత్యంత కీలకంగా ఉన్న వైరా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోని చిల్లకల్లు, జగ్గయ్యపేట వెళ్లే రహదారిలో సోమవరం వద్ద చేపట్టిన అండర్‌పాస్ హైలెవల్ వంతెన స్లాబ్ నిర్మాణ దశలోనే గురువారం సాయంత్రం కుప్పకూలిపోయింది. జరిగిన ప్రమాదతీరు తీవ్రంగా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రాణహాని లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ జరిగిన ప్రమా ద తీరు అందరిని ఉలిక్కిపడేలా చేసింది.



కుప్పకూలిన గ్రీన్‌ఫీల్డ్ హైవే స్లాబ్ శిథిలాలను తొలగించిన దృశ్యం

నాణ్యమైన సెంట్రింగ్ ఏర్పాటు చేయకపోవడం వల్లే

20 అడుగుల ఎత్తులో నిర్మిస్తోన్న అండర్‌పాస్ హైలెవల్ వంతెనకు నాణ్యమైన సెంట్రింగ్ ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు గాయపడ్డారు. వారికి మొక్కుబడిగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం లేకపోవడంతో శుక్రవారం వారి ఆరోగ్యపరిస్థితి కొంత ఇబ్బందికరంగా మారింది. రాష్ట్ర, జిల్లా సీపీఎం నాయకులు కూలిన వంతెనను పరిశీలించడంతో పాటు గాయపడిన కార్మికులను పరామర్శించి నప్పుడు ఇక్కడ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడమేకాకుండా వారిపై నిర్బంధకాండ కొనసాగిస్తున్నారనే వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కూలిన వంతెన స్లాబ్ శిథిలాలను రాత్రికిరాత్రే యుద్ధప్రాతిపదికన తొలగించారు. శుక్రవారం ఉదయానికి వంతెన గోడల మధ్యలో కూలిన స్లాబ్ శిథిలాలు ఒక్కటీ కూడా లేవు. స్లాబ్ కూలడానికి కారణాలపై తనిఖీలు చేయకుండానే మసిపూసి మారేడు కాయచేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారని సీపీఎం నాయకులు ధ్వజమెత్తారు. అండర్‌పాస్ వంతెన నిర్మిస్తున్నందున వైరా-జగ్గయ్యపేట అలాగే మధిర రూట్లో వాహనాల రాకపోకలకు నిర్మించిన డైవర్షన్ రోడ్డు గుంతలమయంగా ఉన్నప్పటికీ వెంటనే మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.



స్లాబ్ కూలిన తర్వాత బయటకు కన్పిస్తున్న ఇనుప చువ్వలు

రోడ్డుపై నీళ్లు కూడా చల్లడం లేదు

ఈ రోడ్డు నిర్మాణానికి సంబంధిచి ప్రతిరో జూ సిమెంట్, బొగ్గు, యాష్ ట్యాంకర్లు, లారీలు వేలాదిగా తిరుగుతున్నాయి. అలాగే ఇతర వాహనాలు కూడా వేలసంఖ్యలోనే ఉన్నాయి. ఈ వాహనాల రాకపోకల సమయంలో విపరీతమైన దుమ్ము లేచి ప్రయాణికులను, పరిసరాల్లోని వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా కనీసం రోడ్డుపై నీళ్లు కూడా చల్లటం లేదు. తమ క్యాంపు కార్యాలయం ముందు మాత్రం దుమ్ము లేవకుండా నీళ్లు చల్లుకుంటున్న కాంట్రాక్టు సిబ్బంది రోడ్డుపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కూలిన వంతెనే కాకుండా మిగిలిన రోడ్లు, వంతెనల వద్దకూడా సెంట్రింగ్ ఇతర మెటీరియల్ నాణ్యతాలోపం లేకుండా ఇప్పటికైనా తగు జాగ్రత్తలు తీసుకొని మరోసారి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాణ్యతాలోపంతోనే వంతెన కుప్పకూలింది: సీపీఎం

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వైరా సమీపంలోని సోమవరం వద్ద చేపట్టిన వంతెన నాణ్యత లోపభూయిష్టంగా ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు ఆరోపించారు. కుప్పకూలిన గ్రీన్‌ఫీల్డ్ హైవే వంతెన పనులను శుక్రవారం సీపీఎం జిల్లా బృందం పరిశీలించింది. గాయపడిన కూలీలను పరామర్శించింది. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే అథార్టీ క్యాంపు కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. సంఘటనలో గాయపడిన ఐదుగురు కార్మికులను మొక్కుబడిగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి మెరుగైన వైద్యం చేయించకుండా వదిలేశారని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌కు చెందిన వలస కూలీలతో పనులు చేయిస్తూ రెండు,మూడునెలలపాటు వేతనాలు చెల్లించకుండా, తీవ్రగాయాలైనా పట్టించుకోకుండా వారి కుటుంబాల దగ్గరకు వెళ్లనివ్వకుండా అత్యంత నిర్బంధంలో పనులు చేస్తున్నారని దుయ్యబట్టారు. సీపీఎం నాయకులతో కాంట్రాక్టు సిబ్బంది దౌర్జన్యంగా వ్యవహరించడంతో ఆందోళన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తతగా మారడంతో వైరా ఎస్ఐ మేడా ప్రసాద్ అక్కడకు చేరుకొని మెరుగైన వైద్యం అందించటానికి, కార్మికుల పెండింగ్ వేతనాలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్లు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, తూము సుధాకర్, బాజోజు రమణ, షేక్.జమాల్, హరి వెంకటేశ్వరరావు, బెజవాడ వీరభద్రం పాల్గొన్నారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే అథార్టీ క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పోలీసులు శారీరక, మానసిక దృఢత్వం కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జనవరి 19: పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని కలిగి ఉండాలని, అప్పుడే విధి నిర్వహణ సమర్థవంతంగా చేయగలుగుతారని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ అన్నారు. 15రోజులపాటు జరిగే సిటీ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ సిబ్బంది మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నగరంలోని పరేడ్‌మైదానంలో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ముందుగా సెర్మోనియల్ పరేడ్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో క్రమశిక్షణ చాలా కీలకమన్నారు. మొబిలైజేషన్ ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందికి చాలా కీకల మని, శిక్షణ కాలంలో నేర్చుకున్న అంశాలు మరిచిపోకుండా ఉండాలన్నారు గతంలో శిక్షణ పొందిన మెళుకువలను నివృత్తి చేసుకుంటూ ఇండోర్, అవుట్‌డోర్, ఫైరింగ్ ప్రాక్టీసులో ఉత్తమ ప్రతిభచూపాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీ లు ప్రసాదరావు, కుమారస్వామి, ఏసీపీ నరసయ్య, ఆర్ఐ కామరాజు, శ్రీశైలం, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.

మల్లు నందినిని కలిసిన సింగరేణి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్



మల్లు నందినిని సత్కరిస్తున్న నాయకులు

రుద్రంపూర్ (సింగరేణి), జనవరి 19: సింగరేణి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (1630/1982) కమిటీ సభ్యులు శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందినిని హైదరాబాద్‌లో కలిశారు. సింగరేణి కాలరీస్‌లో ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ అవసరాన్ని నాయకులు ఆమెకు వివరించారు. ఈ మేరకు వారు వినతి పత్రం అందజేశారు. నందినిని కలిసిన వారిలో సింగరేణి కాలరీస్ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాట ఓదేలు, ప్రెసిడెంట్ గంగారపు లింగమూర్తి, సీనియర్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోడ రమేష్, సీనియర్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆరెపల్లి రామచందర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ దామెర ప్రవీణ్ కుమార్, కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ మురళి, కార్పొరేట్ బ్రాంచ్ సెక్రటరీ దంసాలపూరి వెంకటేష్, తంగెళ్ల నాగయ్య, కార్మిక నాయకులు కొత్తపల్లి ప్రవీణ్ కుమార్, జూల రాజేష్, పొగ రు దేవాప్రవీణ్, కొయ్యడ మనోజ్ తదితరులున్నారు. ఈ సందర్భంగా నాయకులు మా ట్లాడుతూ తాము చెప్పిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని నందిని తమకు హామీ ఇచ్చారని వారు వెల్లడించారు.

పురుగులమందు తాగి పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



సూర్యప్రకాష్(ఫైల్)

చంద్రుగొండ, జనవరి 19: సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చిన ఓ పదోతరగతి విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం రావికంపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రావికంపాడు గ్రామానికి చెందిన తలారి ముత్తయ్య, కవిత దంపతుల పెద్దకుమారుడు సూర్యప్రకాష్ (15) ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోని వియం బంజర్ ఎస్సీ వసతి గృహంలో ఉంటూ పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల సంక్రాంతి సెలవులకని స్వగ్రామం రావికంపాడు వచ్చాడు. సెలవులు ముగిసినా ఇంటివద్దే ఉన్న అతడిని పాఠశాలకు వెళ్లాలని రెండురోజులుగా తల్లిదండ్రులు కుమారుడికి చెబుతున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సూర్య ప్రకాష్ పురుగుమందు తాగాడు. కొంతసేపటికి బయటనుంచి వచ్చిన కుటుంబసభ్యులు గమనించి వెంటనే చికిత్స కోసం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మాచినేని రవి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని..

దుమ్ముగూడెం జనవరి 19: దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని మట్టా అనూష (18) హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కొద్ది రోజుల క్రితం విద్యార్థిని అస్వస్థతకు లోనవగా కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సలకై హైదరాబాద్ తరలించారు. అక్కడి వైద్యులు శుక్రవారం శస్త్రచికిత్స పూర్తిచేశారు. కొద్దిసేపటికే పరిస్థితి విషమించింది. దీంతో అనూష మృతి చెందింది.

● ఇల్లెందురూరల్, జనవరి 19: చికిత్స పొందుతూ యువ కుడు మృతి చెందాడు. ఈసంఘటన బొంబాయి తండాలో శుక్రవారం జరిగింది. తండాకు చెందిన గుగులోత్ వెంకన్న కుమారుడైన గుగులోత్ పవన్(20) ఇల్లెందులో డిగ్రీ చదువుతున్నాడు. కడుపులో నొప్పి భరించలేక 11న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. హుటాహుటిన ఇల్లెందు ప్రభుత్వ వైద్య శాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మంలోని చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు.

ఏడుగురు మావోయిస్టు

సానుభూతిపరుల అరెస్టు

పేలుడు పదార్థాలు సరఫరా చేస్తుండగా అదుపులోకి

ఏడుగురి ముఠాలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యక్తులు

ఇల్లెందుటౌన్, జనవరి 19: మావోయిస్టులకు అందజేసేందుకు పెద్దమొత్తంలో పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఏడుగురు సానుభూతిపరుల ముఠాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఇల్లెందు సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఇల్లెందులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. అందులో ఉన్న ఏడుగురు వ్యక్తులు అనుమానాస్పందంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో పేలుడు పదార్థాలున్నాయని గుర్తించారన్నారు. ఈ క్రమంలో 400జిలెటిన్ స్టిక్స్, వెయ్యి డిటోనెటర్లు, మూడు వైర్ బండిళ్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇక తాము అరెస్టు చేసిన వారిలో భద్రాద్రి జిల్లా ఇల్లెందుకు చెందిన జెడిపేటి రమేష్, ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం విశ్వనాథపల్లికి చెందిన బోడస నర్సింహ, ముదిగొండకు చెందిన అల్లకుంట వెంకన్న, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్‌నగర్‌కు చెందిన మహ్మద్ యాకూబ్‌పాషా, ఒడిస్సా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కాటంపల్లికి చెందిన సున్నం కన్నా, మడకం లచ్చ, మేట్టగూడేనికి చెందిన సున్నం గంగా, ఉన్నారని వెల్లడించారు. వీరంతా ఒప్పందం ప్రకారం నిషేధిత మావోయిస్టులకు అందించేందుకు ఈ పేలుడు పదార్థాలను తరలిస్తున్నారన్నారు. అయితే ఈ ముఠాలో ఉమ్మడిఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తులు ఉండటం తీవ్ర సంచలనంగా మారింది.

నేడు, రేపు రాష్ట్ర దంత వైద్యుల

వార్షిక సదస్సు

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి19: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో తెలంగాణ రాష్ట్ర దంత వైద్యులు వార్షిక సదస్సును ఖమ్మంలో నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కుతుంబాక శ్రీరామ్, సెక్రెటరీ నాగుబండి కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఖమ్మంలో తొలిసారిగా ఈ సదస్సు నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. దంతవైద్య రంగంలో నూతన, అత్యాధునిక శిక్షణ విధానాలను, ఆయా రంగాల్లోని ప్రముఖులైన వైద్యులు వివరించనున్నట్టు తెలిపారు. ఈసదస్సుకు దంతవైద్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైద్యులు సీహెచ్ వీఆర్ నాగేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, కిషోర్‌గౌడ్, సునీల్ పాల్గొన్నారు.

అప్పుడిలా ఇప్పుడిలా

- సత్తుపల్లి పురపాలకం పరిధిలో బందెల దొడ్డి స్థలం స్వాధీనం
- అప్పట్లో సదరు స్థలం ఆక్రమణపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు
- 8 నెలల తర్వాత స్పందించిన అధికారులు .. అప్పుడూ ఇప్పుడూ రాజకీయ జోక్యమే



బందెలదొడ్డిపై అక్రమార్కుల కన్ను



గతేడాది ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం, బందెలదొడ్డికి ఫెన్సింగ్ వేసిన మునిసిపల్ సిబ్బంది

సత్తుపల్లి, జనవరి 19: సత్తుపల్లి పురపాలకం పరిధిలోని గుడిపాడు రోడ్డులో తామర చెరువు సమీపంలో తారురోడ్డు పక్కన రెండు దశాబ్దాల కాలం నుంచి ఉన్న బందెలదొడ్డి స్థలాన్ని ఆక్రమించుకున్నారంటూ గతేడాది మే నెలలో వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులకు 8నెలల తర్వాత మునిసిపల్ అధికారులు స్పందించారు. రెండు గుంటల స్థలాన్ని రెండు దశాబ్దాల క్రితం కొందరు కొనుగోలు చేసి అప్పట్లో సత్తుపల్లి గ్రామ పంచాయితీకి బందెలదొడ్డి నిర్మాణం నిమిత్తం విరాళంగా ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ స్థలంలో గ్రా మ పంచాయితీ నిధులతో బందెలదొడ్డిని నిర్మించారు. కాలక్రమంలో సత్తుపల్లి పట్టణంలో భూముల ధరలకు రెక్కలు రావడం, సదరు స్థలం విలువ రూ.40లక్షలకు పైగా ఉండటంతో బందెల దొడ్డిని ఒక వ్యక్తి దశలవారీగా ధ్వంసం చేసుకుంటూ వచ్చి ఆక్రమించుకున్నారని పలువురు ఆరోపించారు. దీనిపై గతేడాది మే24న 'బందెల దొడ్డిపై అక్రమార్కుల కన్ను' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం వెలు వడింది. ఈ క్రమంలో అయ్యగారిపేటకు చెందిన కొందరు, అప్పటి కాంగ్రెస్ నాయకులు కొందరు మునిసిపల్ అధికారులకు బందెలదొడ్డి స్థలం ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ స్థలాన్ని మునిసిపల్ అధికారులు అప్పట్లో పరిశీలించి రికార్డుల పరంగా ఆధారాలు ఉంటే చర్యలు తీసుకుంటామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. తాజాగా గత మూడు, నాలుగు రోజులుగా బందెల దొడ్డి స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసే కార్యక్రమాన్ని మునిసిపల్ అధికారులు చేపట్టారు. బందెలదొడ్డి స్థలమంటూ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు.

స్వాధీనానికి 8నెలల సమయం

బందెలదొడ్డి నిర్మించి ఉన్నట్లు, దాని చుట్టూ ఉన్న ప్రహరీ ధ్వంసం చేసినట్లు అక్కడ ఆనవాళ్లు ఉన్నప్పటికీ అప్పట్లో మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకోవడానికి మీనమేషాలు లెక్కించారు. ఆక్రమణ ఆరోపణలు వచ్చిన వ్యక్తికి నోటీసులు ఇచ్చామంటూ సరిపెట్టారు. కానీ అధికారులు అప్పట్లో ముందుకు సాగకుండా అప్పటి అధికార పార్టీ నాయకులు కొందరు అడ్డుపడ్డట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అధికార పార్టీ ఒత్తిడుల మేరకు మునిసిపల్ అధికారులు మౌనం ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. కానీ రాష్ట్రంలోనూ, సత్తుపల్లిలోనూ అధికార మార్పిడి జరగడం, గతేడాది ఆక్రమణపై ఫిర్యాదు చేసినవారిలో కాంగ్రెస్ నాయకులు ఉండటం, వారు తిరిగి గతంలో చేసిన ఫిర్యాదును తెరపైకి తేవడంతో సహజంగానే అధికారులు ఇప్పుడు తీవ్రంగా స్పందించారని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే గత రెండుమూడు రోజులుగా ఫెన్సింగ్ వేసే కార్యక్రమం చేపట్టి పూర్తి చేశారు. అప్పుడూ, ఇప్పుడూ మునిసిపల్ కార్యాలయంలో అధికారులు మాత్రం మారలేదు. అధికార పార్టీ, అధికారం మాత్రం మారింది. ఈ క్రమంలో జరిగిన పరిణామాలతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అసలు బందెలదొడ్డి ఆక్రమణ... సదరు స్థలం మునిసిపాలిటీది అవునా కాదా అనే విషయం అధికారులు తేల్చడానికి 8నెలల సమయం పట్టడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. మొత్తంమ్మీద రెండు గుంటల బందెలదొడ్డి స్థలం వెనుక నెలల తరబడి రాజకీయ జోక్యం సాగడం విశేషం.

ఆధారాల కోసమే జాప్యం

సుజాత, సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్

ఆరోపణలు వచ్చిన 8నెలల తర్వాత స్థలం స్వాధీనం చేసుకోవడంపై జరుగుతున్న చర్చకు సంబంధించి సత్తుపల్లి మునిసిపల్ కమీషనర్ సుజాతను సంప్రదించగా ఫిర్యాదు వచ్చిన సమయంలో నోటీసులు జారీచేశామని, భూమి దానం చేసినట్లు డాక్యుమెంట్లను ఇటీవలే దాతలు తమకు అందజేశారని, అవి అందిన తర్వాత స్థలం స్వాధీనం చేసుకున్నామని, అక్కడ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

అంగన్‌వాడీ సిబ్బంది సేవలు అభినందనీయం

కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావ్

ఐసీడీఎస్ సిబ్బందికి అంగన్‌వాడీ కేంద్రాల ప్రతుల అందజేత

కొత్తగూడెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సిబ్బంది చిన్నారుల ఆలనా, పాలనా చూస్తుంటారని, వారు చేసే ఇతర సేవలు కూడా అభినంద నీయమని కొత్తగూడెం, భద్రాచలం ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం ఐడీఓసీ సమావేశపు హాలులో మహిళా శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మినీ అం గన్‌వాడీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా ప్రభుత్వం మార్చినందున ఉత్తర్వు ప్రతుల అందజేత కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది సేవలను అభినందించారు. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని బాధ్యతలను అంగ న్‌వాడీ సిబ్బంది నేర్పుతో ఓపికగా చేస్తుంటారని అన్నారు. జిల్లాలోని 626 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిం దని, అంగన్‌వాడీ కేం ద్రాల ద్వారా ప్రీ స్కూల్, పౌష్టికా హారం అందుతుంద న్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుం ద న్నారు. దీని వల్ల ఎటువంటి రోగాలు ప్రజల దరి చేరవని వారు పేర్కొన్నారు. కార్య క్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ డాక్టర్ రాంబా బు, మహిళా సంక్షేమ అధికారి వేల్పుల విజేత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ఇతర అధికారులు

వేటగాళ్ల విద్యుత్ ఉచ్చులకు అడవిగేదె బలి



అడవి గేదె కళేబరం

సత్తుపల్లిరూరల్, జనవరి 19: సత్తుపల్లి మండలం యాతాలకుంట-రేగళ్లపాడు మధ్య అడవిలో వేటగాళ్లు దుప్పులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ వైర్లకు అడవి గేదె తగిలి చనిపోయింది. గురువారం రాత్రి ఈ సంఘటన జరిగినట్లు భావిస్తున్నారు. శుక్రవారం ఉదయం అడవికి వెళ్లిన కొందరికి మృతిచెందిన అడవిగేదె కనిపించడంతో స్థానికులు అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది. సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లోని అడవులలో వన్యప్రాణుల కోసం వేట జరుగుతున్నట్లు గత కొంతకాలంగా ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం అడవిదున్న విద్యుత్ వైర్లకు చనిపోయి కనిపించడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. కాగా చనిపోయిన అడవి గేదె గర్భవతి అని, జిల్లా అధికారుల సమక్షంలో దహనం చేసినట్లుగా సమాచారం.

వివరాలు చెప్పేందుకు ఎఫ్ఆర్‌వో నిరాకరణ

అడవిలో విద్యుత్ తీగలకు అడవిగేదె చనిపోయిన విషయం బహిర్గతమైనప్పటికీ స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారి స్నేహలత వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా తానేమీ మీడియాతో మాట్లాడనని చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారని ప్రచారం జరిగినప్పటికీ ఆ విషయంపై కూడా మాట్లాడేందుకు ఆమె నిరాకరించారు. మొత్తం అడవిదున్న వేటగాళ్లకు బలవ్వడం, దీనికి సంబంధించిన జిల్లా అధికారులు చేసిన విచారణ, తదితర వివరాలను అధికారులు గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది.

వైరాలో సైకో వీరంగం

వైరా, జనవరి 19: వైరా మునిసిపల్ కార్యాలయ సమీపంలో శుక్రవారం జాతీయ ప్రధాన రహదారిపై ఓ సైకో వీరంగం సృష్టించాడు. మాచిన బట్టలు, గడ్డంతో మానసిక రోగి అయిన ఒక వ్యక్తి చేతిలో కర్ర తీసుకొని రోడ్డుపైన వచ్చిపోయే పాదచారులు, ద్విచక్రవాహన చోదకులపై దాడిచేశాడు. ఐదారుగురు ఈ సైకో చేతిలో దెబ్బలు తిన్నారు. వెంటనే కొంతమంది పోలీసులకు సమాచారం ఇవ్వగా అదుపులోకి తీసుకొన్నారు.

ఇటుక దందాపై కొరడా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రఘునాథపాలెం, జనవరి 19: చింతగుర్తిలో ఇటుక దందాపై అధికా రులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఇటు క దందా.. ఇష్టారాజ్యం' కథనంపై అధికా రులు స్పందించారు. అక్రమంగా కలప నిల్వ ఉం చ టంపై స్పందించిన డీఎఫ్వో సిద్ధార్థవిక్రమ్‌సింగ్ చిం తగు ర్తికి డీఆర్వో లక్ష్మీపతిని పంపించి విచారణ నిర్వ హించారు. ఆయన రూ.30వేల జరిమానా విధించారు. అలాగే విద్యుత్ ఏడీఈ సంజీవరావు స్పందించి అక్రమంగా విద్యుత్ వాడకంపై విచారణ నిర్వహించి కేసు నమోదు చేసి జరిమానా విధించారు.

కేసుల విచారణలో జాప్యం వహించొద్దు




మాట్లాడుతున్న రోహిత్‌రాజ్

కొత్తగూడెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేసుల విచారణలో జాప్యం వహించొద్దని పోలీసులకు ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. కొత్తగూడెంలోని ఐఎంఏ ఫంక్షన్ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో సమర్థవం తమైన విచారణ ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా చేసి, బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా కల్పించి, పోలీస్ శాఖపై నమ్మకాన్ని పెంచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ రోడ్లపై తిరుగుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమరవాణా, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా హాట్ స్పాట్స్‌ను గుర్తించి గంజాయిని అమ్మే వ్యక్తులతో పా టు గంజాయికి అలవాటు పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, దొంగతనం కేసుల్లో ప్రస్తుతం పోలీస్ శాఖ అనుసరిస్తున్న సాంకేతికతను ఉపయోగించి, నేరస్తులను పట్టుకుని సొత్తు రికవరీ చేసి బాధితులకు అందేలా చూడా లన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఇ. విజయ్ బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్; పాల్వంచ డీఎస్పీ వెంకటేష్, ఇల్లందు డీఎస్పీ రమణమూర్తి, మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు, డీసీ ఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సైబర్‌క్రైమ్స్ డీఎస్పీ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికలకు

ఓటరు జాబితా సిద్ధం చేయాలి

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 19: ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటరు జాబితాను రూపొందిం చాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వికాస్ రాజ్ అన్నారు. శుక్రవారం అన్నిజిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం, పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పన తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక ఓటరునమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంపై స్వీప్ కార్యక్రమాలు చేపట్టి ఓటరు నమోదుశాతాన్ని పెంచేదిశగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు బి సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, ఖమ్మం కల్లూరు ఆర్డీవోలుగణేష్, అశోక్ చక్రవర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, డీఈవో సోమశేఖర శర్మ, మాస్టర్ ట్రైనర్ కొండపల్లి శ్రీరాం, జిల్లా సంక్షేమాధికారి సుమ, డీపీవో హరికిషన్, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరిన్‌టెండెంట్లు రాంబాబు పాల్గొన్నారు.



మేడారం మార్గానికి నిధులేవీ?

- 'సమ్మక్క సారక్క' దారిలో మర్కోడు-రేగళ్ల రోడ్డు ప్రధానం
- గతంలో ప్రభుత్వం నిధులతో తాత్కాలిక రహదారి
- ఈ ఏడాది దారి గురించి ఊసెత్తని సర్కారు
- రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న భక్తులు

ఆళ్లపల్లి, జనవరి 19: రెండేళ్లకోసారి ప్రపంచంలో అతి పెద్ద జాతర నిర్వహించే ములుగు జిల్లా, మేడారంలో నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరకు మేడారం వేళ్లేందుకు భద్రాద్రి జిల్లా కేంద్రం నుంచి ఆళ్లపల్లి, మర్కోడు, రేగళ్ల నుంచి మరో మార్గం కూడా ఉంది. అయితే ప్రభుత్వం ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో 14కి.మీ. మేరక గుట్టలబాటలపై భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

14కి.మీ. రోడ్డు ఎంతో కీలకం

కొత్తగూడెం జిల్లా కేంద్రం నుంచి మణుగూరు, ఏటూరునాగారం, తాడ్వాయి నుంచి మేడారానికి ఒక మార్గం, ఇల్లెందు, వరంగల్, ములుగు నుంచి మరో మార్గం, ఇల్లెందు, గుండాల, పస్రా నుంచి వేరే మార్గం ఉంది. అయితే జిల్లా కేంద్రం నుంచి ఈ మార్గలే కాకుండా ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు మీదుగా, కరకగూడెం మండలం నుంచి తాడ్వాయి, మేడారానికి చేరుకోవచ్చు. అయితే మర్కోడు నుంచి రేగళ్ల వరకు 14కి.మీ. అడవిమార్గం, గుట్టలు ఉండటంతో పాటు రెండు ఒర్రెల దగ్గర రోడ్డు ధ్వంసం అయింది. ఈ ప్రాంతం నుంచి భక్తులకు మేడారం వేళ్లేందుకు దగ్గర కావడంతో కష్టమైనపట్టికి ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ దారిలో అతి కష్టంగా ఆటోలు, బోలెరోలు, ట్రాక్టర్లు కూడా వెళతాయి. 14 కిలో మీటర్ల ప్రయాణానికి గంటకుపైనే సమయం పడుతుంది. అయితే కొందరు పట్టణ, ఇతర ప్రాంతాలకు చెందిన వారు మొబైల్ రూట్ మ్యాప్‌తో ద్వారా వచ్చి, సరైన రోడ్డు లేక ముందుకు వేళ్లలేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెను తిరిగి మేడారం వేళ్లాలంటే మర్కోడు నుంచి అదనంగా కొత్తగూడెం, మణుగూరు, ఏటూరునాగారం ద్వారా 200కి.మీ., గుండాల మీదుగా అయితే సుమారు 140 కి.మీ. ప్రయాణం చేయాల్సి వస్తుంది. కనీసం 14కి.మీ మట్టిరోడ్డు అయిన ఉంటే, రేగళ్ల నుంచి మేడారం సుఖంగా చేరుకోవచ్చు. గతంలో భక్తుల కష్టాలను చూసిన స్థానిక మర్కోడు వ్యాపారులు, ఆళ్లపల్లి పోలీస్‌శాఖ, ఆధ్వర్యంలో మూడు జాతరలకు తాత్కాలిక గ్రావేల్ రోడ్డు పోయగా, 2020 జాతరకు పంచాయతీ నిధులతో నిర్మించారు. 2022 జాతరకు ప్రభుత్వం రూ. 5లక్షలు నిధులు కేటాయించి గ్రావేల్ రోడ్డు ఏర్పాటు చేసింది.

దగ్గరిమార్గంపై పట్టింపే లేదు

మేడారం జాతరకు వేళ్లేందుకు ఆళ్లపల్లి మండలం నుంచి మర్కోడు-రేగళ్ల మార్గం ప్రధానమైనప్పటికీ 14కి.మీ. రోడ్డు వేసేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. రూ.3 కోట్లు నిధులు ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు, అటవీశాఖ అడ్డుపడుతుందని రోడ్డు వేయడం లేదు. కేవలం ఈ దారి మేడారానికే కాకుండా అన్ని సమయాల్లో ప్రయాణికులకు అవసరం. మేడారం వేళ్లేందుకు ఈ దారి దగ్గర కావడంతో గతంలో ఆళ్లపల్లి పోలీసులు, వ్యాపారుల సహకారంతో తాత్కాలిక గ్రావెల్ రోడ్డు వేసి వాహనాలు వెళ్లేందుకు సౌకర్యం ఏర్పాటు చేశారు. తర్వాత గ్రామ పంచాయతీ నిధులతో పోయగా, గత జాతర సమయంలో మేడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 5లక్షల నిధులు కేటాయించి రోడ్డు పోశారు.



మర్కోడు- రేగళ్ల మధ్య తెగిపోయిన రోడ్డు



మర్కోడు- రేగళ్ల మధ్య గుట్టమార్గం

అయితే ఈ ఏడాది జాతర దగ్గర పడుతున్నా ప్రభుత్వం కాని, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టి మేడారం వేళ్లేందుకు మర్కోడు- రేగళ్ల రోడ్డు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కొత్తగూడెం ఆర్టీసీ డిపోనకు కలిసివచ్చే దారి

14కి.మీ. ఉన్న మర్కోడు- రేగళ్ల తార్ రోడ్డు పూర్తయితే, మళ్లీ వచ్చే జాతరకు కొత్తగూడెం డిపో నుంచి మధ్యలో స్టాప్ లేకుండా నేరుగా మేడారం వేళ్లే భక్తులను తీసుకేళ్లేందుకు చక్కటి అవకాశం ఉంది. మేడారం వెళ్లేందుకు ఆర్టీసీకి సుమారు 22కి.మీ. దూరం కలిసివస్తుంది. కొత్తగూడెం నుంచి మణుగురు, ఏటూరునాగారం, తాడ్వాయి, మేడారం వరకు సుమారు 160 కి.మీ. ఉండగా, అదే కొత్తగూడెం, ఆళ్లపల్లి మార్గం గుండా మేడారానికి సుమారు 130కి.మీ. ఉంటుంది. కేవలం ఆర్టీసీ బస్సులే కాకుండా ఇతర ప్రైవేటు వాహనాలకు, ఆదాయం కలిసి వస్తుంది. ట్రాఫిక్ కూడా ఉండదు. ప్రజాప్రతినిధులు మర్కోడు- రేగళ్ల రోడ్డుపై దృష్టిపెట్టి తాత్కాలికంగానైన రోడ్డు ఏర్పాటు చేయాలని భక్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

25 నుంచి ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 19: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 31 వరకు రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఎస్సీ స్టేడియం క్రికెట్ నెట్స్ ఇన్‌చార్జ్ మతిన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 25 లోపు తమ ఎంట్రీలు, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం 9346624241 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో 18 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 3,140 మంది విద్యార్థులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 19: పాలేరు నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఖమ్మం జిల్లాలో 9పరీక్ష కేంద్రాలు, కొత్తగూడెం జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు 3,140 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష శనివారం ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఉంటుంది. విద్యార్థులను పరీక్ష హాల్లోనికి ఉదయం 10:45 నిమిషాల నుంచి పరీక్షా హాల్లోనికి అనుమతిస్తారు. ఉదయం 11:30 కు ఒక్క నిమిషం ఆలస్యమై నా విద్యార్థులను పరీక్షా హాల్లోనికి అనుమతించటం జరగదు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్ష హాలు కి వచ్చేటప్పుడు తప్పనిసరిగా హాల్ టికెట్, ఆధార్ కార్డు, పరీక్షప్యాడ్, బ్లూ ఇంక్ పెన్ను కానీ బ్లాక్ ఇంక్ పెన్నులు తీసుకొని రావాలి. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ఖమ్మం నగరంలో విద్యార్థులు హాల్ టికెట్లు తెచ్చుకోలేకపోతే ఖమ్మం రిక్కా బజార్ హైస్కూల్ సెంటర్లో నవోదయ అధికారులు నుంచి హాల్ టికెట్లు పొందవచ్చు. ఖమ్మం జిల్లాను ఖమ్మం, మధిర, సత్తుపలి తిరుమలాయపాలెం బ్లాకులుగా విభజించి నలుగురు బ్లాక్ లెవెల్ ఆఫీసర్లను పర్యవేక్షణ కోసం నియమించారు. కొత్తగూడెం జిల్లాలో ఐదుగురు బీఎల్ఓలను నియమించారు.

23న గిరిజన యువతకు జాబ్‌మేళ

భద్రాచలం, జనవరి 19: గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 23న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నర్సింగ్, ప్రైవేటు సెక్యూరిటీ, వెబ్‌మొబైల్ అప్లికేషన్, బ్యూటిఫికేషన్, ఎలక్ట్రిషియన్, సీసీ టీవీ టెక్నీషియన్, టూవీలర్ మెకానికల్ రంగాల్లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ జాబ్‌మేలాలో పాల్గొనాలని 18 నుంచి 35 సంవత్సరాల్లోపు అర్హతలు, వయసును బట్టి రూ.13 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలవారు 23న ఉదయం 9 గంటలకు భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 8143840906, 6302608905 లో సంప్రదించాలని కోరారు.

బిల్లులు చెల్లించాలా? వద్దా?

- ఉచిత విద్యుత్‌పై వినియోగదారుల సందేహం
- 200 యూనిట్లపై క్షేత్రస్థాయిలో మొదలైన విచారణ

మధిర, జనవరి 19: ప్రభుత్వం పేదల గృహాలకు నెలకు 200యూనిట్లవరకు ఉచితంగా కరెంట్ సరఫరా చేస్తామని ప్రకటించడంతోపాటు ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించడంతో ఈనెల కరెంట్ బిల్లు చెల్లించాలా.. వద్దా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీగా ఇచ్చిన ఆరు హామీలలో భాగంగా విద్యుత్‌ను ప్రతి ఇంటికి 200 యూనిట్లు ఇస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల్లో గెలపొందడంతో ఆ ఆరు హామీల అమలుకు కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగా గత నెల 28నుంచి ఈనెల 6వతేదీ వరకు ప్రజాపాలన పేరుతో గ్రామాల్లో సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సభల్లో జిల్లాలో భారీగా దరఖాలు వచ్చాయి. మధిర నియోజకవర్గంలోనే లక్ష దరఖాస్తులు రావడంతో వాటిని అధికారులు ఆన్‌లైన్ చేసి విచారణ చేసేపనిలో పడ్డారు. వీటిలో ఉచిత కరెంట్ దరఖాస్తులు సింహభాగం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ దశలో విద్యుత్ శాఖ ఎప్పటిలాగే ఈనెల కూడా ఇంటింటికి తిరిగి కరెంట్ రీడింగ్ తీసి బిల్లులు జారీ చేస్తున్నది.



ఈనెల అందరూ బిల్లులు తప్పకుండా కట్టాల్సిందేనని కరెంట్ అధికారులు, సిబ్బంది చెబుతుండటంతో ప్రజలు కట్టాలా, వద్దా అనే అయోమయంలో పడ్డారు. కరెంట్ సిబ్బంది మాత్రం కట్టాల్సిందేనని కరాకండిగా చెబుతున్నారు. వచ్చేది ఎండా కాలం కరెంట్ బిల్లు కట్టకుంటే కరెంట్ కట్ చేస్తారేమోనని ప్రజలు భయపడుతున్నారు. ఒకవేల బిల్లులు కట్టాక ప్రభుత్వం ఉచిత కరెంట్ ప్రకటిస్తే తమ డబ్బులు తిరిగి రావుకదా అనే ఆలోచనలో ఉన్నారు. కరెంట్ అధికారులు మాత్రం ప్రభుత్వం ఫ్రీకరెంట్ అమలు చేసినా డబ్బులు వినియోగదారుని డిపాజిట్ అకౌంట్‌లో జమఅవుతాయని చెల్లించిన డబ్బులు ఎక్కడికి పోవని చెబుతున్నారు. కొందరు అధికారులైతే ఫ్రీకరెంట్ ఇచ్చినా ఫిబ్రవరి నెల నుంచి ఇస్తాం.. ఈ నెల బిల్లు కట్టాల్సిందేనని చెబుతుండటంతో ప్రజలు ఏమీ చేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. ఇదే అభిప్రాయం అన్ని గ్రామాల్లో ప్రజలు వ్యక్తం చేస్తున్నట్లు సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. ఈనెల కరెంట్ బిల్లులు జమ ఆగిపోతే కరెంట్ శాఖకు భారీగా ఆదాయం ఆగిపోయే ప్రమాదం ఉంది.

ఒక్క మధిరలోనే 2.5కోట్ల ఆదాయానికి గండి

ఒక్క మధిరలోనే కరెంట్ బిల్లుల ద్వారా ప్రతినెల 2.5కోట్ల ఆదాయం వస్తుంది. ఇదే డివిజన్ లో అయితే పది కోట్ల వరకు గృహవినియోగదారుల బిల్లుల ద్వారా ఆదాయం వస్తుంది. కొంతమంది గృహ వినియోగదారులకు ఉచిత కరెంట్ ఇచ్చినా ఒక్క మధిరలోనే 1.5 కోట్ల ఆదాయం పడిపోతుంది. ఫ్రీ కరెంట్ అమలైతే ఇంత మొత్తంలో విద్యుత్ శాఖకు నష్టం వస్తుందని అంచనాలు వేస్తున్నారు. అయితే ప్రభుత్వం ఫ్రీకరెంట్ అందరికీ ఇస్తుందా. లేక ఏదైనా నిబంధనలతో కొందరికే పరిమితం చేస్తుందా అనేది తేలాల్సివుంది. ఇప్పటికే మధిర మండలంలో విద్యుత్ బకాయిలు రూ. 6.5కోట్లు వరకు ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పుడు ఫ్రీ కరెంటు అమలైతే ఇక బిల్లులు కట్టేవారు ఉండరని కేవలం కమర్షియల్ బిల్లులు మాత్రమే వస్తాయని అభిప్రాయం వ్యక్తమవుతుంది.

రైతులను మోసం చేస్తే ఊరుకోం

- నాణ్యత పరిశీలనకు ముగ్గురు సాంకేతిక సిబ్బంది
- మార్కెట్ సందర్శనలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్

ఖమ్మం మార్కెట్, జనవరి 19: మార్కెట్‌లో పంట నాణ్యత బాగాలేదని, రైతులను మోసం చేసే వ్యాపారులను ఉపేక్షించేది లేదని ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. శుక్రవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన ఆయన మాట్లాడారు. మిర్చి పంటకు రోజు రోజుకూ ధరలు ఎందుకు తగ్గుతున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులలో తిరిగుతూ పంట నాణ్యతను పరిశీలించి పలువురు రైతులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏమైనా పంట దెబ్బతిన్నాదా? ఎకరాకు దిగుబడి ఎంత మేర వస్తుంది, ధరలు ఏ విధంగా దక్కుతున్నాయని ఆరా తీశారు. మిర్చి రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిర్చి ధర ఒక్క సారిగా వేలకు వేలు ఎందుకు తగ్గుతోందని అక్కడున్న మార్కెట్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాలుకు రెండు మూడు రోజుల వ్యవధిలోనే ధరలు భారీగా తగ్గించడమేంటని ప్రశ్నించారు. ధరలను నిరంతరం పర్యవేక్షించాలని, మార్కెట్‌లో నాణ్యత పరిశీలనకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల నుంచి తాలు, వైరస్ లాంటి తెగుళ్లనిర్ధారణకు, నాణ్యత పరిశీలనకు ముగ్గురు సాంకేతిక సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. వారు మార్కెట్‌లో రైతులకు నిరంతరం అందుబాటులో



రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఉంటారని, ధర తగ్గించి కొనుగోలు చేసే పంటను వారు పరీక్షిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు జెండా పాట ధరకు కొనుగోలు ధరకు చాలా అంతరం ఉంటుందని, నాణ్యత మేరకు ధర రావడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాంటాల సమయంలో పంట నాణ్యత బాగాలేదని ధర తగ్గిస్తామంటూ కొర్రీలు పెడుతున్నారని వాపోయారు. దీంతో ఇక నుంచి అలాంటివి జరగవని నాణ్యత పరిశీలన అధికారులు నిత్యం మీ వెంటే ఉంటారని ఆయన హామీ ఇచ్చారు. కావాలని ధర తగ్గించే వ్యాపారులను, రైతులను నష్టపరిచే వ్యాపారులపై చర్యలు తప్పవని వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, జిల్లా వ్యావసాయ అధికారి విజయనిర్మల, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ ఇన్‌చార్జ్ సెక్రెటరీ బజారు, పీడీ ఎంఐపీ రమణ పాల్గొన్నారు.

ఇల్లెందు మునిసిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసులు

- ఫిబ్రవరి 5న తీర్మానం కోసం సమావేశం

ఇల్లందుటౌన్, జనవరి 19: ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై 19 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీస్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా కౌన్సిలర్లకు తిరిగి నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ జారీ చేసిన నోటీసులను ఇల్లెందు మునిసిపల్ కమిషనర్ నవీన్‌కుమార్ కౌన్సిలర్లకు అందజేశారు. 19 మంది కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై వచ్చే నెల ఫిబ్రవరి 5వ తేదీన ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశామని, ఈ సమావేశానికి హాజరుకావాలని కలెక్టర్ నోటీస్‌లో పేర్కొన్నారు. గత ఏడాది కాలంగా చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు చేసిన ప్రయాత్నాలు విఫలమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా అవిశ్వాసం ఏర్పాటు చేసేందుకు బీఆర్ఎస్ కౌన్సిలర్లు అంతా ముమ్మరంగా ప్రయత్నాలు చేయగా.. నిబంధనల ప్రకారం ఫార్మెట్-1లో అవిశ్వాస నోటీస్ ఇవ్వలేదనే కారణంతో కలెక్టర్ తిరిగి నోటీసులు ఇవ్వాలని కౌన్సిలర్లను ఆదేశించారు. ఎన్నికల అనంతరం మరో పర్యాయం గత వారం అవిశ్వాస తీర్మానం లేఖను జిల్లా కలెక్టర్‌కు అందజేయగా శుక్రవారం అవిశ్వాసం కోసం నోటీసులు జారీ



కౌన్సెలర్‌కు నోటీసు అందజేస్తున్న కమిషనర్ నవీన్ కుమార్

చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన 17 మంది కౌన్సిలర్లతో పాటు సీపీఐ, న్యూడెమోక్రసీకు కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్‌కు చెందిన మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుపై అవిశ్వాస తీర్మానం కోసం సంతకాలు చేశారు. ఎంతా కాలంగా వాయిద పడుతూ వస్తున్న అవిశ్వాస తీర్మానం తేదీని ప్రకటించడంతో మరో పర్యాయం ఇల్లెందు మున్సిపాటీ రాజకీయాలపై ఉత్కంఠ నెలకొన్నది. అవిశ్వాస తీర్మానం నెగ్గేనా.. లేదా వీగిపోయేనా.. అన్న సందేహాలను పలువురు వ్యక్తపరుస్తున్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసులను కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫిషియే సభ్యులు, శాసనసభ్యుడు కోరం కనకయ్యకు సైతం నోటీసులు అందజేశారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్ ?

- చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు
- బడులకు వెళ్లని ఉపాధ్యాయులు
- నష్టపోతున్న విద్యార్థులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి19: జిల్లా విద్యాశాఖలో స్వయంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలను బేఖాతర్ చేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యాశాఖలో దీర్ఘకాలికంగా రేషలైజేషన్ జరుగకపోవడం వల్ల చాలా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు నుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య ఉండడం లేదని తెలుస్తోంది. విద్యార్థులు నిష్పత్తి కన్నా కొన్ని పాఠశాలల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులే ఉన్న కారణంగా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయు లు లేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు.

భద్రాద్రి జిల్లాలో 42 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న ఉపాధ్యాయులకు వర్క్ అడ్మినిస్ట్రేషన్ చేసే పనిలో జిల్లా



యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఈ విద్యా సంవత్సరం జూలై నెలలో వర్క్ అడ్మినిస్ట్రేషన్ చేసిన అనంతరమే బదిలీల ప్రక్రియ చేపట్టింది. ఈ పరిస్థితిని గమనించి గత జిల్లా కలెక్టర్ తొలిదశలో సుమారు 150 మంది ఉపాధ్యాయులను వర్క్ అడ్మినిస్ట్రేషన్ ప్రక్రియలో కేటాయించారు. ఈ క్రమంలో గత పది రోజుల క్రితం రెండో దశ వర్క్ అడ్మినిస్ట్రేషన్‌కు ప్రస్తుత జిల్లా కలెక్టర్ సుమారు 42 మంది ఉపాధ్యాయులను కేటాయించారు. హైస్కూల్‌లో సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు కాంప్లెక్స్, పక్కన కాంప్లెక్స్‌తో పాటు, పక్క మండలాల అతితక్కువ దూరంలో వర్క్ అడ్మినిస్ట్రేషన్ చేశారు. కొంతమంది ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లకుండా వివిధ కారణాలతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లోనే కొనసాగుతున్నారు. వర్క్ అడ్మినిస్ట్రేషన్ చేసిన పాఠశాలలకు ఉపాధ్యాయులను పంపించకుండా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి వద్దనే ఉంచుకుంటున్నట్లు సమాచారం. వారిని రిలీవ్ చేయకపోవడంతో విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. సబ్జెక్ట్‌లో ప్రావీణ్యం లేక జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల సంఖ్య క్రమంగా తక్కుతుంది. గత నాలుగు నెలల నుంచి సబ్జెక్ట్‌లను బోధించే ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. 16 మంది ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లలేదని తెలుస్తోంది.

మాతృభాషపై బాలలు పట్టు సాధించాలి

- బాలోత్సవ్ చిల్డ్రన్స్ సొసైటీ కల్చరల్ అధ్యక్షుడు డా. వాసిరెడ్డి రమేష్ బాబు
- కొత్తగూడెం క్లబ్‌లో కథ, కవిత కార్యశాల ప్రారంభం
- 3 జిల్లాల నుంచి తొలి రోజు 325 మంది విద్యార్థుల హాజరు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ పాల్వంచ టౌన్, జనవరి 19: మాతృభాషపై బాలలు విద్యార్థి దశలోనే పట్టు సాధించాలని బాలోత్సవ్ చిల్డ్రన్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కథా, కవిత కార్యశాల కార్యక్రమాన్ని విద్యార్థులతో జ్యోతి ప్రజ్వలన చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడారు. విద్యార్థి దశలోనే బాలబాలికలలో సాహిత్య అభిలాష కల్గించడానికి ఈ కార్యశాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాతృభాష గొప్పతన్నాన్ని విద్యార్థులందరూ పొందుకోవాలని సోదాహరణంగా వివరించారు.

భద్రాద్రి జిల్లా డీఈవో ఎం. వెంకటేశ్వరచారి మాట్లాడుతూ.. పువ్వు పుట్టగానే పరిమళించే విధంగా ఈ కార్యశాలను విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. చక్కని కవులుగా రచయితలుగా ఎదుగుతారని ఆశీర్వదించారు. ప్రతి ఒక్కరికి ఈ కార్యశాలలో నేర్చుకొనే విషయాలు వారి జీవితాలలో ఎదురవుతాయని అన్నారు. లోకంలో సుఖ దుఖాలను కనిపించి కనిపించని విధంగా కలలను కట్టిపడేసి కవులు రచయితలను తయారు చేసేందుకు ఈ కార్యశాల నిలుస్తుందని జన సాహితి అధ్యక్షుడు దివికుమార్ కొనియాడారు.

కార్యశాలలో పాల్గొన్న కవులు రచయితలను బాలబాలికలకు పరిచయం



విద్యార్థులతో జ్యోతి ప్రజ్వలన చేయిస్తున్న సొసైటీ అధక్షుడు రమేష్ బాబు, డీఈవో వెంకటేశ్వరచారి

చేశారు. అనంతరం విద్యార్థులను కథా, కవితా తరగతులుగా విభజించి శిక్షణా తరగతులను తొలిరోజు ప్రారంభించారు. కార్యశాలలో విద్యార్థుల వ్యాసాలను, కథలను, కవితలను కల్చరల్ సొసైటీ అధ్యక్షులు డా వాసి రెడ్డి రమేష్‌బాబు స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యశాలలో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట జిల్లాల నుంచి బాలబాలికలు తొలిరోజు 325 మంది పాల్గొన్నారు. వాటిలో 33 ప్రభుత్వ, 18 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీరితో పాటు 48 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శనివారం రెండో రోజు కార్యశాల కొనసాగిస్తామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యశాలలో కథా విభాగానికి చెందిన హైద్రాబాద్ అనువాదకురాలు కథా రచయిత్రి స్వర్ణ కిలారి, ప్రముఖ కథా రచయితలు కొట్టం రామకృష్ణారెడ్డి, మన్నె ఏలియా, కథకులు భగవతం పాల్గొన్నారు. కవుల విభాగంలో విజయవాడ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి అనిల్ డ్యాని, దాచపల్లికి చెందిన రవికుమార్ కోసూరి, ఖమ్మం ప్రాంతానికి చెందిన కట్టుకోజుల రమేష్, నిర్వాహకులు చీరంశెట్టి కాంతారావు, మండవ సుబ్బారావు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



డీఈవో వెంకటేశ్వరచారిని సన్మానిస్తున్న కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు, సభ్యులు

కవితలు రాయడం నేర్చుకున్నా
వి. తేజస్విని, కొత్తగూడెం



కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఈ కార్యశాలలో ఊహించని విధంగా పాల్గొనే అవకాశం నాకు దక్కింది. రచయితలు, కవుల సలహాలు సూచనల మేరకు కవితలు ఎలా రాయాలో నేర్చుకున్నాను. చాలా సంతోషంగా ఉంది..

ప్రపంచానికి పరిచయం అవుతా
సాయి బాలాజీ, చండ్రుగొండ



కార్యశాలలో నేర్చుకున్న విలువైన విషయాలను అంది పుచ్చుకొని భవిష్యత్తులో ప్రపంచానికి పరిచయం అవుతా.. ప్రస్తుత సమాజంలో ఎక్కువ మొత్తంలో వాడకంలో వినియోగిస్తున్న సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటాను.

అన్ని భాషల్లో తెలుగు లెస్స
ఎం. రాధాబాయి, అశ్వాపురం



ఎన్ని భాషలున్న తెలుగు భాష గొప్పతనం వర్ణించలేనిది. అన్ని భాషల్లో తెలుగు భాష లెస్స అనే నానుడి మాటలు ఈ కార్యశాలలో ప్రతిబింబిస్తున్నాయి. రాబోయే రోజుల్లో తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి.

కొత్తగూడెం గణేష్‌టెంపుల్ ఈవోపై బదిలీ వేటు

కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 19: కొత్తగూడెంలోని శ్రీవిజయవిఘ్నేశ్వరస్వామి దేవస్థానం ఈవో సులోచనపై బదిలీ వేటు పడింది. ఆమెను డీసీ కార్యాలయానికి బదిలీచేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు అందాయి. ఆమె స్థానంలో పాల్వంచలోని పెద్దమ్మతల్లి ఆలయంలో ఈఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రజనీకుమారి గణేష్‌టెంపుల్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇటీవల ఆలయంలో చోటు చేసుకున్న పరిణామాలు, పలు ఆరోపణలు దృష్ట్యా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు దేవాదాయ శాఖ భూముల ఆక్రమణలను అడ్డుకున్నందుకే తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని బావించిన పలువురు తమ పలుకుబడిని ఉపయోగించి ఈఓను బదిలీ చేయించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైన ఈవో బదిలీ కొత్తగూడెంలో చర్చ నీయాంశంగా మారింది. ఇదిలాఉండగా ఈఓ సులోచన తమ పి ల్లల చదువుల రిత్యా బదిలీని నిలిపివేస్తూ తమకు మూడు నెలల గడువు ఇవ్వవల్సిందిగా ఉన్నతాధికారులను కోరినట్లు సమాచారం.

దమ్మపేట సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

●రూ.5,59,750 రికవరీకి కలెక్టర్ ఆదేశం

దమ్మపేట, జనవరి 19: నిధుల దుర్వినియోగానికి పాల్పడిన దమ్మపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్‌ను రద్దు చేసినట్లు దమ్మపేట ఎంపీడీవో నాగేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దమ్మపేట గ్రామ పంచాయతీ పాలక వర్గం చేసిన ఫిర్యాదు మేరకు ఉన్నతాదికారులు విచారణ చేశారన్నారు. ఆవిచారణలో రూ.549750లు దుర్వినియోగం జరిగిందని నిర్ధారించారు. దుర్వినియోగం చేసిన డబ్బులను కలెక్టర్ ఆదేశాల ప్రకారం సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రభుత్వానికి చెల్లించాలని లేనియడల రెవెన్యూరికవరి చట్ట ప్రకారం దుర్వినియోగం చేసిన నిధులను వసూలు చేస్తామని ఎంపిడీవో తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

అశ్వారావుపేట రూరల్, జనవరి 19: అశ్వారావుపేట బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే పాలేరు నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్ పి.హరిత శుక్రవారం తెలిపారు. అశ్వారావుపేట పరీక్షా కేంద్రంలో వివిధ జిల్లాలకు చెందిన 86మంది ప్రవేశ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు.

జడ్పీ పాఠశాలకు వితరణ

అశ్వాపురం జనవరి 19: మండల పరిధిలోని మల్లెలమడుగు జడ్పీ హైస్కూల్ వ్యవస్థాపక ఉపాధ్యాయుడు దివంగత తిప్పారెడ్డి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన ద్వితీయ కుమారుడు విద్యావేత్త విజయ్‌బాస్కర్‌రెడ్డి శుక్రవారం పాఠశాలకు రూ.30వేల విలువ చేసే ఫర్నీచర్‌ను వితరణగా అందజేశారు. విజయ్‌బాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు చేయూతనందిస్తానన్నారు. కార్యక్రమంలో మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపి, ఎస్ఎంసి మెంబర్ మిలట్రీ వెంకన్న, జాలెరామకృష్ణారెడ్డి,బండారు రవీందర్‌రెడ్డి, రణబోతుల రామిరెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఇల్లెందురూరల్, జనవరి 19: మండలంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో బాలరాజు సూచించారు. శుక్రవారం ఇల్లెందు మండలంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనాలను ఎంపీవో చిరంజీవితో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తు పంచాయతీ భవనాలు పూర్తి చేసే విదంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం గ్రామపంచాయతీలో జరుగుతున్న నర్సరీ పనులను ఆయన పరిశీలించారు.

కేంద్ర పభుత్వ పథకాలపై అవగాహన

సుజాతనగర్, జనవరి 19: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయా శాఖల అధికారులు ప్రజలకు తెలిపారు. శుక్రవారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేంద్ర పభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీకా కృష్ణవేణి, వైద్యులు డాక్టర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి బి. నరేంద్రప్రసాద్, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపు పాల్వంచలో భారీ రథయాత్ర

పాల్వంచ టౌన్, జనవరి 19: ఈ నెల 22న అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాల్వంచలో ఆదివారం శ్రీరామ సేనా వాహిని ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ శ్రీరామ రథయాత్రలో భగవత్ బంధువులంతా పాల్గొని జయప్రదం చేయాలని శ్రీరామ సేనా వాహిని బాధ్యులు జేమూరి వేణుగోపాలచార్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం గట్టాయిగూడెం భక్తాంజనేయ స్వామి వారి దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యశ్వీఆర్‌కె చార్యులు, ఎ.లక్ష్మణచార్యులు శ్వేత ప్రకాశ్, బ్యాంకు చారీ, జయిన్‌కుమార్, ఆనంద్, జె.సుధాకర్, సీహెచ్.వీరయ్య, చందు, శివపార్వతి, శ్రీదేవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన సురేష్‌నాయక్

చుంచుపల్లి, జనవరి 19: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్‌ను జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్, శుక్రవారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బల్మూర్ వెంకట్‌ను ప్రకటించడంపై అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సురేష్‌నాయక్ మాట్లాడుతూ- కాంగ్రెస్ పార్టీ విజయానికి అహర్నిషలు కృషిచేసిన బల్మూర్‌వెంకట్ కష్టాన్ని పార్టీ అధిష్టానం గుర్తించిడంపై హర్షవ్యక్తం చేశారు.

'పది' విద్యార్థులు భయాన్ని వీడాలి

జూలూరుపాడు, జనవరి 19: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండడంతో ఎలాంటి భయాందోళనకు గురి కావద్దు అని ఇప్పటి నుంచే ఒక ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని మాస్టర్ ట్రైనర్లు ఏటా సురేంద్ర, తాటిపల్లి సుధీర్‌లు తెలిపారు. జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సహకారంతో మండలంలోని వివిధ పాఠశాలల్లో పదొవ తరగతి విద్యార్థులకు పరీక్షల గురించి అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని పాపకొల్లు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రణాళికతో ముందుకు సాగినట్లు అయితే మంచి ఫలితాలను సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్లు నవీన్‌రాథోడ్, అరిగల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు,రేపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

» అధికారులకు కలెక్టర్ ప్రియాంక ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కొత్తగూడెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు శని, ఆదివారాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఈ నెల 20,21 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారన్నారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయం హాలులో వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొన్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు,ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కొరకు భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో శని, ఆదివారాలు ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 8 వరకు ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్‌స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన ప్రతినిధుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు సమయపాలన పాటించాలని, నూతన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6,7,8 దరఖాస్తు ఫారములు బూత్‌స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ప్రతీక్ జైన్, డాక్టర్ రాంబాబు, శిరీష, మంగీలాల్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటు నమోదు చేసుకోవాలి

●మణుగూరు: మణుగూరు మండలంలో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహశిల్దార్ రాఘవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

పట్టభద్ర ఓటు హక్కు నమోదు..

గతంలో జరిగిన గ్యాడ్యుయేట్ ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఓటు హక్కు కలిగిన వారితో పాటు నూతన ఓటుకై అర్హులు దరఖాస్తు చేసుకోవాలని తహశిల్దార్ రాఘవరెడ్డి సూచించారు. 1వ తేది నవంబర్ 2023 నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న పట్టభద్రులందరు అర్హులన్నారు. ఫాం-18 ద్వారా తహశిల్దార్ కార్యాలయంలో దరఖాస్తుచేసుకోవచ్చని, లేని పక్షంలో ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏమైన సమాచారం కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

●దుమ్ముగూడెం:మండలంలోని పోలింగ్ బూత్ లెవల్ కేంద్రాల్లో 20, 21 తేదీల్లో ఓటరు జాబితాలో సవరణలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. అలాగే ఫిబ్రవరి 2 వరకు తహసీల్దార్ కార్యాలయంలో సవరణల దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

●జూలూరుపాడు: 18 ఏళ్లు నిండిన యువతి, యువకులందరు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శారద తెలిపారు. శుక్రవారం జూలూరుపాడులోని తన కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు.

●అశ్వారావుపేట : అశ్వారావుపేట నియోజక వర్గ పరిదిలోని అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి అశ్వారావుపేట మండలాల పరిదిలో ఈనెల 20,21 (శని, ఆది వారాలలో) ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమము నిర్వహించటం జరగుతుందని సహాయ ఎన్నికల అధికారి అశ్వారావుపేట తహసీల్దార్ కృష్ణప్రసాదు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను సాధిస్తాం: ఎంఆర్‌పీఎస్

దమ్మపేట/మణుగూరుటౌన్, జనవరి 19: ఎన్ని అడ్డంకులు ఎదురైన అంతిమ విజయం ధర్మానిదేనని, ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొలిగిపోగు కాంతారావు అన్నారు. శుక్రవారం దమ్మపేటలో ఏపూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంతారావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగ దండోర ఉద్యమం ఎన్నో ఒత్తిడులను ఎదుర్కొందని, మంద కృష్ణ మాదిగ గల్లీ నుండి డిల్లీ వరకు నిరంతర ఉద్యమం నడిపారన్నారు. సుప్రీం కోర్టులో త్వరలోనే దీనిపై తీర్పు రాబోతుందని, కోర్టులో న్యాయమే గెలుస్తుందనే నమ్మకం ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కొలిగిపోగు వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షులు దాట్ల అశోక్, కార్యదర్శి సొరకాయ సీతసారాములు, రఘురాం, ముసలయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: ఎస్సీ వర్గీకరణకు మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5, 6 తేదిలలో నిర్వహించే ఛలో డిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ పినపాక నియోజకవర్గ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మణుగూరులో నిర్వహించిన సమావేశంలో జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మోదుగు జోగారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిద్దెల తిరుమలరావులు మాట్లాడారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు దేవంగి వెంకటరమణ, గద్దల రమేష్, తోకల శ్రీను, రావులపల్లి చిన్నారి, కనిగంటి వేణు, ప్రైవేటు మాదిగ ఉద్యోగుల జేఏసీ నాయకులు రావులప్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ పెన్షన్ క్లైయిమ్స్ ఇకపై ఆన్‌లైన్‌లోనే

●జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ బసవయ్య

కొత్తగూడెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ పెన్షన్ క్లైయిమ్స్ ఇకపై ఆన్‌లైన్‌లోనే సెటిల్మెంట్ చేసే విధానాన్ని అమలుపరచటానికి, విధివిధానాలను చర్చించటానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడిషినల్ సెక్రటరీ, కోల్ ఇండియా అనుబంధ అన్ని బొగ్గు సంస్థల డైరెక్టర్స్ (పర్సనల్)తో వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం నిర్వహించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ మాట్లాడుతూ సింగరేణి, కోల్ ఇండియా అనుబంధ అన్ని బొగ్గు సంస్థలు ఫిబ్రవరి ఒకటి నుంచి సీఎంపీఎఫ్ క్లైయిమ్స్ అన్నీ కూడా ప్రస్తుతం ఉన్న మాన్యువల్ విధానానికి స్వస్తి పలుకుతూ ఆన్‌లైన్ విధానం ద్వారా సెటిల్ చేయాలని, పైలట్ ప్రాజెక్టుగా ఈ విధానం అమలు చేయడానికి సింగరేణి, ఎంసీఎల్ సంస్థలను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రబొగ్గు మంత్రిత్వ శాఖ తెలిపిన ప్రకారం ఈ నెలాఖరులో చెల్లించవలసిన సీఎంపీఎఫ్ క్లైయిమ్స్‌ను ఆన్‌లైన్ విధానంలో సెటిల్ చేయడానికి సింగరేణి సంస్థ అమలు పరచటానికి చర్యలు తీసుకుంటామని జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కె. బసవయ్య తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి తరుపున జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కె. బసవయ్య, ఏజీఎం (పర్సనల్) కే.శ్రీనివాసరావు, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యన్నారాయణ, మేనేజర్(ఐటీ) వేణుగోపాల్, డీవై పీఎంలు ప్రవీణ్, డిప్యూటీ సూపరింటెండెండ్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మణుగూరులో ఏరియా స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశం

●కాంట్రాక్ట్ కార్మికుల రక్షణపై ఆరా తీసిన డీఎంఎస్ సావర్కర్

మణుగూరుటౌన్, జనవరి 19: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా స్థాయి 17వ త్రైపాక్షిక సమావేశాన్ని శుక్రవారం ఏరియా ఇల్లెందు క్లబ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సింగరేణి డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ ఉమేష్ ఎం సావర్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత ఏరియా అధికారులు, నాయకులతో రక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మృతి చెందిన ఉద్యోగుల ఆత్మశాంతికై మౌనం పాటించారు అనంతరం డైరెక్టర్ సావర్కర్ మాట్లాడారు. 16వ ఏరియా స్థాయి త్రైపాక్షిక సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, గుర్తించిన సమస్యల పరిష్కారంలో జరిగిన పురోగతి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కార్మికులతో పాటు పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ఓబీ కార్మికులకు సంబంధించి చేపడుతున్న రక్షణ చర్యలు, కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లిస్తున్న వేతన వివరాలు, కల్పిస్తోన్న సౌకర్యాలపై ఆరా తీసారు. వీటికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు డైరెక్టర్‌లకు తెలిపారు. ఏరియా రక్షణ అధికారి వెంకటరమణ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏరియా తీసుకుంటున్న రక్షణ చర్యలను వివరించారు. కార్మికుల రక్షణ, ఆరోగ్యపరిరక్షణ పట్ల నిరంతరం సమీక్షలు జరపాలని డీఎంఎస్ సావర్కర్ ఏరియా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కార్మికసంఘ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎంపీపీ శంకుస్థాపన

అశ్వాపురం జనవరి 19: అశ్వాపురంలో అభివృద్ధిపనులకు ఎంపీపీ ముత్తినేని సుజాత శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. స్థానిక ముస్లిం కాలనీలో రూ.4లక్షల అంచనాతో సైడ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ జరిపారు. ఎంపీపీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తోందన్నారు. దానిలో బాగంగానే ముస్లిం కాలనీ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సైడ్‌డ్రైనేజీ నిర్మాణానికి మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, పీఆర్ ఏఈ చక్రదరచారి, మండల కాంగ్రెస్ నాయకులు మురళీకృష్ణ, ప్రవీన్, రఫీ, అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన పీసీసీఎఫ్ సువర్ణ



మందెరికలపాడు నర్సరీని పరిశీలిస్తున్న పీసీసీఎఫ్

పాల్వంచ, జనవరి 19: ఉమ్మడి జిల్లాలో పర్యటిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ శుక్రవారం పాల్వంచ మండలం కిన్నెరసాని వన్యప్రాణి సంరక్షణ విభాగాన్ని సందర్శించారు. ముందుగా మందెరికలపాడు నర్సరీని పరిశీలించారు. గతంలో కంపా స్కీం కింద నిధుల వినియోగం ఎలా జరిగింది, భవిష్యత్తు కార్యాచరణ ఏ విధంగా ఉంటుంది అనే విషయాలపై అధికారులతో చర్చించారు. వారికి సూచనలందించారు. అనంతరం కిన్నెరసాని డీర్‌పార్క్, జలాశయం, మూజియం తదితరాలను పరిశీలించారు. పర్యావరణ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వర్క్‌షాపును పరిశీలించారు. శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావనీర్ షాపును ఆమె ప్రారంభించారు. అనంతరం కొద్ది సేపు జలాశయంలో బోటు షికారు చేశారు. ఆమె వెంట సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, ఎఫ్‌డీఓ దామోదర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు, ఎఫ్ఎస్ఓ హారిక ఉన్నారు.

దోబీఘూట్ భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందుటౌన్, జనవరి 19: ఇల్లెందు పట్టణంలోని కళాస్ బస్తిలో ఉన్న దోబీ ఘాట్ నిర్మాణ స్థలాన్ని కొంత మంది ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతు రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఇల్లెందు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. రజక సంఘ నాయకులు మాట్లాడుతూ- ప్రభుత్వం రజికుల సంక్షేమం కోసం రూ.2 కోట్ల వ్యయంతో దోబీఘాట్ నిర్మాణా పనులు రెండు నెలలుగా సాగుతున్నాయని వివరించారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో నిర్మిణాలు జరుగుతున్నపట్టికి స్పందించ కుండా ఆకస్మతుగా ఈ స్థలం తమదే అంటు కొంత మంది వ్యక్తులు అక్రమణ చేస్తున్నట్టు వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజిక సంఘం అధ్యక్షులు కృష్ణ, గిరి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వే సంఘ్ యూనియన్

సీడబ్ల్యూసీ సభ్యుడిగా జేమ్స్‌పాల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, పాల్వంచ టౌన్, జనవరి 19: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిూస్ సంఘ్ యూనియన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా కొత్తగూడెం రైల్వేస్టేషన్ (భద్రాచలం రోడ్)లో చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న జేమ్స్ పాల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ మెన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయ్స్ సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య ప్రకటించి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయ్స్ సంఘ్ ట్రైయాన్యువల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి జేమ్స్ పాల్‌ను ఏకగీవంగా ఎన్నుకున్నారు. నా కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని ప్రమాణం చేశారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

భద్రాచలం, జనవరి 19: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో తెలంగాణ యుటీఎఫ్ డైరీ, వాల్ క్యాలెండర్లను గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషోర్‌సింగ్, కృష్ణ, వెంకన్న, రవికుమార్, వెంకటరెడ్డి, బాలు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

స్వర్ణభద్రకవచాలతో భద్రాద్రి రామయ్య



విరాళం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 19: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులకు స్వర్ణభద్రకవచాలతో దర్శనమిచ్చారు. అలాగే నిత్య కల్యాణ మండపంలో స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది., అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే దేవస్థానం నిత్యన్నదాన పథకంకు ఏపీలోని రాజమండ్రికి చెందిన గుండు వెంకట సుదీర్ రూ.లక్ష విరాళం, చిత్తూరు జిల్లా చింతలపట్టడైగనర్‌కు చెందిన వీడీ రఘురామన్, లోకేశ్వరి దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. అదేవిదంగా సాయంత్రం స్వామి వారికి నిత్యకల్యాణ మండపంలో సంధ్యాహారతి నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించండి

పినపాక, జనవరి 19: గ్రామాల్లో ప్రధాన సమస్యలను గుర్తించడం, తద్వారా గ్రామ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని పినపాక ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం పినపాక మండల కేంద్రంలో గ్రామ సభలు నిర్వహణకు సన్నాహక సమావేశం ఎంపీపీ గుమ్మడి గాంధీ అధ్యక్షతన జరిగింది. ఈ గ్రామసభల్లోనే సమస్యలను పరిష్కరించేందుకు ఆయా పంచాయతీల అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చిస్తారన్నారు. అనంతరం ఎంపీవో కె వెంకటేశ్వరరావు మాట్లాడారు. సన్నాహక సమావేశానికి పినపాక, జానంపేట పీహెచ్‌సీల వైద్యులు మధు, శృతి, ఏపీఓ వీరభద్రస్వామి, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు, ఆశాలు, అంగన్‌వాడీలు హాజరయ్యారు.

ఘనంగా ఎన్ఎఫ్ఏఈఈ ఆవిర్భావ వేడుకలు

అశ్వాపురం జనవరి 19: ఎన్ఎఫ్ఏఈఈ (జాతీయ అణుశక్తి కార్మిక సమాఖ్య) 27వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం గౌతమీనగర్ కాలనీలో హెవీవాటర్ ప్లాంట్ ఎంప్లాయిస్, సైంటిఫిక్, సూపర్‌వైజరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు గడ్డం రమేష్ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. హెవీవాటర్ ప్లాంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎఫ్ఏఈఈ ఆధ్వర్యంలో అణుశక్తి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో కార్మికులకు వైద్యసౌకర్యాల మెరుగుదలకు మరింత కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ఎఫ్ఏఈఈ కోశాధికారి పొండ్యా కేశవరావు, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పోతురాజు శ్రీనివాసరావు,ప్రతాపరెడ్డి,వెంకటేశ్వర్లు,కెవి.రావు,నాసా నాయకులు వుణుగోపాల్,అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

18 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

భద్రాచలం, జనవరి 19: గిరిజన సంక్షేమ శాఖ పోస్టు మెటిక్ హాస్టల్స్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రావలసిన 18 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ కార్యాలయం ముందు శుక్రవారం సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డైలీవేజ్ కార్మికులకు ఏడు నెలల ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 18 నెలల జీతాలు చెల్లించకుండా తీవ్రమైన ఇబ్బందులకు ప్రభుత్వం గురి చేస్తుందని వారి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేసి జీవో నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మాచారి, వివిధ జిల్లాల నాయకులు లక్ష్మణ్ నాయక్, హీరాలాల్, కౌసల్య, పాయం ముత్తయ్య పాల్గొన్నారు.

భూ నిర్వాసిత అద్దె వాహన యజమానులు, డ్రైవర్లతో సింగరేణి యాజమాన్యం చర్చలు..



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న అద్దె వాహన యజమానులు, డ్రైవర్లు

రుద్రంపూర్ (సింగరేణి), జనవరి 19: భూ నిర్వాసిత అద్దెవాహన యజమానులు, డ్రైవర్లతో సింగరేణి యాజమాన్యం శుక్రవారం చర్చలు జరిపింది. కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో హెచ్ఆర్డీ కాన్ఫరెన్సు హాలులో సింగరేణి యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా ఉన్న అద్దె వాహనాలు నడిపే అన్ని ఏరియాల వాహన యజమానులు, డ్రైవర్లతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఇటీవల గోదావరిఖని, శ్రీరాంపూర్ ఏరియాలలో పర్యటిస్తున్న సమయంలో కన్వేయన్స్ వెహికిల్ యజమానులు, డ్రైవర్లు సీఎండీ బలరామ్‌కు తమ సమస్యలు పరిష్కరించమని వినతులు అందించారు. ఈ క్రమంలోనే అద్దె వాహన యజమానులు, డ్రైవర్లతోనే సింగరేణి అధికారులు చర్చలు జరిపారు. సీఎంపీఎఫ్‌వో అసిస్టెంట్ కమిషనర్ ఎం కనకమ్మ మాట్లాడుతూ- కన్వేయన్స్ డ్రైవర్లకు సీఎం పీఎఫ్, పెన్షన్ విధానం అమలుపై సందేహాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో జీఎం(సీపీపీ) జక్కం రమేష్, జీఎం(ఈఎం) ఎస్ జగన్ మోహన్‌రావు, జీఎం పర్సనల్ ఐఆర్ పీఎం బి.హనుమంతరావు, డిజిఎం పర్సనల్ అజయ్‌కుమార్, వైవిఎల్ వరప్రసాద్, డీజీఎం(సీపీపీ) బిడివి వరప్రసాద్, డిజిఎం (ఎంఎస్) వెంకయ్య డీజీఎం (ఈఎం) లక్ష్మీనారాయణ, ఎస్ఈ రామశేషయ్య తదితరులు ఉన్నారు.

గిరిజన సంఘ నాయకుడిపై డీఎంహెచ్‌వో ఫిర్యాదు

పాల్వంచ, జనవరి 19: డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీషను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఫిర్యాదుపై సీతంపేట బంజరకు చెందిన గిరిజన సంఘ నాయకుడు గుగులోతు రాజేష్ నాయక్‌పై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గుగులోతు రాజేష్ తన బంధువర్గానికి చెందిన ఇద్దరికి ఉద్యోగం ఇప్పించమని డీఎంహెచ్‌వోను కోరారు. కానీ అందుకు ఆమె నిరాకరించడంతో రాజేష్‌నాయక్ నాలుగు నెలలుగా మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీఎంహెచ్‌వో పాల్వంచ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు రాజేష్ నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం..

పాల్వంచ రూరల్, జనవరి 19: తెలంగాణ సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి టీజీసెట్ 2024 ఇంగ్లీష్ మీడియం ప్రవేశాలకు 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూఆర్ కిన్నెరసాని ప్రిన్సిపాల్ గోవర్ధన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని గురుకులల్లో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జూలూరుపాడు/కరకగూడెం, జనవరి19: మండలంలోని జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురం సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కరకగూడెం: కరకగూడెంలోని 33/11 కేవి ఉపకేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ రెడ్డి తెలిపారు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి: యూటీఎఫ్

అశ్వారావుపేట, జనవరి 19: పాఠశాలల్లో ఇబ్బందులు పడుతూ పిల్లలకు భోజనాలు వండి పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు డిమాండ్ చేశారు. అశ్వారావుపేటలో శుక్రవారం ఆసంఘం ఆఫీస్ బేరర్ల సమావేశం మండల అధ్యక్షులు వీరేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆగస్టు నుంచి బిల్లులు రాకపోవటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్లు, హరినాథ్‌బాబు, శ్రీనివాసరావుతో పాటు పలువురు ఉన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం

పాల్వంచ, జనవరి 19: వరిగడ్డి వామి దగ్ధమైన ఘటనతో రైతుకు సుమారు లక్షా యాభై వేల రూపాయల నష్టం వాటిల్లింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచ వికలాంగుల కాలనీకి చెందిన ముద్దా వెంకటేశ్వర్లు తన పశువుల కోసం శుక్రవారం ఇతర ప్రాంతానికి వెళ్ళి లారీలో వరిగడ్డిని తెచ్చాడు. అన్‌లోడ్ చేసి ఇంటి ప్రక్కనే కాళీ స్థలంలో వామి వేశాడు. అనంతరం పని మీద ఇంట్లోకి వెళ్ళాడు. కొద్దిసేపటి తరువాత వరిగడ్డివామి దగ్ధమౌతుండటంతో ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి ఉంటారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు: ఆర్డీవో

దుమ్ముగూడెం జనవరి 19: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని భద్రాచలం ఆర్డీవో మంగీలాల్ హెచ్చరించారు. తూరుబాక గ్రామం వద్ద ఇసుక క్వారీను శుక్రవారం పరిశీలించారు. వాహనాలు ప్రవేశించకుండా ఇసుక క్వారీ చుట్టూ ట్రెంచి ఏర్పాటు చేశారు. ఇసుక అక్రమరవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, గనులశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నిరంజన్, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య, సర్వేయర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు రూ.10 వేల వితరణ

మణుగూరుటౌన్, జనవరి 19: మణుగూరు పట్టణంలోని శ్రీ భార్గవ ఆటో మొబైల్స్ హీరో షోరూం, వాసిరెడ్డి వినయ్‌కుమార్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఓ బాలుని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను వితరణగా అందజేశారు. శుక్రవారం ట్రస్ట్ ఛైర్మన్ వాసిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఈ నగదును చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన తగరంపూడి వెంకటరమణ దంపతుల 16 నెలల బాలుడు అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన వెంకటరమణ వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతోన్న విషయం తెలిసిన విజయభాస్కరరెడ్డి వితరణ అందజేసి చేయుతనిచ్చాడు. కార్యక్రమంలో సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, సుంకిరెడ్డి వీరారెడ్డి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేశా.. అవకాశమివ్వండి

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం, జనవరి 19: పార్టీ కోసం తాను కష్టపడి పని చేశానని, దానిని పరిగణలోకి తీ సుకుని ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీని కలిసిన టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు కోరారు. విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా తాను 2018 నుంచి కొత్తగూడెం అసెంబ్లీ టికెట్ కోసం అవకాశం వచ్చినప్పటికీ రాజకీయ సమీకరణాల వల్ల టికెట్ దక్కలేదని, అయినప్పటికీ కాం గ్రెస్ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యే టీఆర్ఎస్ కండువా కప్పుకున్న తర్వాత, నియోజకవర్గ ప్రజలకు అండగా ఉన్నానన్నారు. పార్టీ పిలుపు నిచ్చిన ప్రతీ కార్యక్రమం విజయవంతం చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. 2023 ఎన్నికల్లో సముచిత స్థానం కల్పిస్తామని అధిష్ఠానం మాటిచ్చిందని, ఆ మా ట విలువకు కట్టుబడి సీపీఐ గెలుపుకోసం శ్రమించానన్నారు. రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని తనకు హామీ ఇచ్చారని నాగసీతారాములు పేర్కొన్నారు.